




www.navabhoomidaily.com | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ 9 మంగళవారం సెప్టెంబర్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 356

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur








# నేడు ఉప-రాష్ట్రపతి ఎన్నిక

- ధన్కడ్ రాజీనామా తర్వాత ఉపరాష్ట్రపతి ఖాళీ
- 9న పోలింగ్‌కు సిద్ధమైన పార్లమెంట్
- ఎన్డీయే తరపున అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్
- ఇండియా కూటమి తరపున జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ
- సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఓటింగ్
- పార్టీ విప్ అమలు కాని ప్రత్యేక ఎన్నికలు
- లోక్‌సభ, రాజ్యసభ మొత్తం 781 ఓట్లు కీలకం
- బీఆర్ఎస్, బీజేడీ దూరం - ఫలితంపై ప్రభావం
- ఎన్డీయేకు స్పష్టమైన సంఖ్యాబలం - గెలుపుపై నమ్మకం
- ప్రతిపక్షం వ్యూహాత్మక పోరు

2



**న్యూదిల్లీ-నవభూమి ప్రతినిధి**

ఉప-రాష్ట్రపతి ఎన్నికలకు సర్వసిద్ధమైంది. 9న మంగళవారం పోలింగ్ జరగనుండగా.. ఎన్డీఏ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరపున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు వెల్లడిస్తారు. రాజ్యసభ సెక్రెటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు సహాయకులుగా మరో ఇద్దరు అసిస్టెంట్ రిట్నరింగ్ ఆఫీసర్లను నియమించారు.ఇక, సీక్రెట్ బ్యాలెట్ విధానంలోనే ఓటింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో పార్టీలు జారీచేసే విప్ చెల్లుబాటు కాదు. అంటే, లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు తమ ఆత్మప్రబోధానుసారం ఓటువేయనున్నారు. ఇక, అధికార ఎన్డీయే గెలుపుపై ధీమాతో ఉంది. కానీ, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బీజేపీ ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందు కోసం ఆది వారం నాడు బీజేపీ వర్క్‌షాపు నిర్వహించింది. ఇక, ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా సోమవారం మధ్యాహ్నం మాక్ పోలింగ్ నిర్వహించి, ఓటింగ్‌పై అవగాహన కలిగించింది. సోమవారం 2.30 గంటలకు పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో జరిగిన ఈ మాక్ పోలింగ్‌లో విపక్ష పార్టీలు ఎంపీలు పాల్గొన్నారు.ఓడిపోతారని తెలిసే తెలుగు వ్యక్తిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టారు: చంద్ర బాబులోక్‌సభ, రాజ్యసభలో ఖాళీలను మినహాయిస్తే ప్రస్తుతం మొత్తం 781 మంది సభ్యులు (542 మంది లోక్‌సభ, 239 మంది రాజ్యసభ) ఉన్నారు. ఇందులో 392 ఓట్లు వచ్చిన అభ్యర్థి విజేతగా నిలుస్తారు లేదా చెల్లుబాటైన ఓట్లలో సగాని కంటే ఎక్కువ సాధించిన అభ్యర్థిని విజేతగా పరిగణిస్తారు.




అయితే, క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం కూడా లేకపోలేదు. కిందట 'సారి జగదీప్ ధన్కడ్ పోటీచేసినప్పుడు ఎన్డీయే లో లేని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బీజేడీలు మద్దతు తెలిపాయి. దీంతో 3 దశాబ్దాల తర్వాత భారీ మెజార్టీ (75 శాతం ఓటింగ్)తో ఉప-రాష్ట్రపతిగా గెలిచిన వ్యక్తిగా ధన్కడ్ నిలిచారు. ఈసారి మాత్రం ఓటింగ్‌కు బీఆర్ఎస్, బీజేడీలు దూరంగా ఉంటామని ప్రకటించాయి. దీంతో 770 మంది ఓటువేయనున్నారు. ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు నల్లేరుపై నడకే. ఎన్డీయేకు మొత్తం 425 మంది సంఖ్య బలం ఉండగా.. వైపీసీ కూడా మద్దతు తెలిపింది. ఏడుగురు స్వతంత్ర ఎంపీలు, అకాలీదళ్, జెడ్‌పీఎంలకు చెందిన ఒక్కొక్క ఎంపీలను కలుపుకుంటే ఎన్డీయే అభ్యర్థికి 458

## గండిపేటలో గోదావరి ఫేజ్-2, 3కు శంకుస్థాపన

## హైదరాబాద్‌కు గోదావరి జలాలు

### నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన

- 16 జలాశయాలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- నెత్తి మీద నీళ్లు చల్లుకుంటే పాపాలు పోవవు - ప్రతిపక్షంపై ఎద్దేవా
- మూసీ నది కాలుష్యం- పశువులు, ప్రజల ప్రాణాలకు ముప్పు
- మంజీరా జలాలు తెచ్చిన పీజేఆర్ పోరాటం గుర్తు చేసిన సీఎం
- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ సొంతం
- ప్రాణహిత-చేవెళ్లతో రంగారెడ్డి సస్యశ్యామలం
- మూసీ పునరుజ్జీవ పథకం - రూ.7,658 కోట్ల ప్రాజెక్టు
- ప్రతిపక్ష కుట్రలు తిప్పికొట్టి, హైదరాబాద్‌ను మేటి నగరంగా తీర్చిదిద్దుతాం

ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్, సెప్టెంబర్ 08: నిజాం సర్కార్ దూరదృష్టితో జంట జలాశయాలను నిర్మించడం వల్లే నగరానికి వచ్చిన వాళ్లకు తాగునీరు అందుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సోమవారం నాడు హైదరాబాద్ సమీపంలోని గండిపేట వద్ద గోదావరి ఫేజ్ 2, 3కి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా హైదరాబాద్ జల మండలి ఆధ్వర్యంలో నిర్మించిన 16 జలాశయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆనాటి మున్సిపల్ మంత్రి శామీర్‌పేట వద్ద గోదావరి నీళ్లు నెత్తి మీద చల్లుకున్నారని గుర్తు చేశారు. నెత్తి మీద నీళ్లు చల్లుకుంటే మీరు చేసిన పాపాలు ఎక్కడికి పోవంటూ బీఆర్ఎస్ నేతలకు ఆయన చురకలంటించారు. మూసీ నదిలో ప్రవహించే నీరు విషంగా మారి పశువులు, మనుషుల ప్రాణాలు తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నది నల్గొండకు విషాన్ని మోసుకెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఎవరు ఏమన్నా మూసీ నది ప్రక్షాళన చేస్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేందుకే ఈ ప్రాజెక్టు అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లోనే హైదరాబాద్‌కు గొప్ప పేరుందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏడాదికి 3 శాతం జనాభా హైదరాబాద్‌కు వలస వస్తోందని గణాంకాలతో సహా వివరించారు. తాగు నీటి అవసరాలు అంతకంతకూ పెరుగుతున్నాయని చెప్పారు. వేసవి వచ్చిందంటే సచివాలయం ఎదుట నిరసనలు ఉండేవని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ పోరాటంతోనే హైదరాబాద్‌కు మంజీరా జలాలు వచ్చాయన్నారు.

హైదరాబాద్‌కు దాహార్తి తీర్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు సీఎం రేవంత్ రెడ్డి. నల్గొండ ప్రజల కోరిక మేరకే మూసీ ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు. మూసీ ప్రక్షాళనపై ఎవరు అడ్డం పడ్డా ముందుకెళ్తున్నామన్నారు. మూసీ కాలుష్యం నుంచి నల్గొండ ప్రజలకు విముక్తి కల్పిస్తామని చెప్పారు. మూసీలో హైదరాబాద్ డ్రైనేజీ కలవకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్‌కు తాగునీరు అందుతుందన్నారు. నల్గొండ ఫ్లోరైడ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

కొందరు తాటిచెట్టులా పెరిగినా బుద్ధి మాత్రం పెరగలేదంటూ ప్రతిపక్ష నేతకు

## పేలిపోతున్న ఏసీలు



- ఫరీదాబాద్‌లో ఏసీ పేలుడు ఘోర విషాదం
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
  పెంపుడు కుక్క కూడా బలి
- అర్ధరాత్రి 1:30 గంటలకు జరిగిన దారుణం
- కిటికీ నుంచి దూకి బతికిన కుమారుడు తీవ్ర గాయాలు
- పేలుడు శబ్దానికి ఇరుగుపొరుగు భయభ్రాంతులు
- ఎందుకు పేలుతాయి ఏసీలు?
- కంప్రెషర్ వేడెక్కడం ప్రధాన కారణం..నిపుణుల హెచ్చరికలు

2

**హరియాణా-నవభూమి ప్రతినిధి**

రానురాను ప్రజలు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిపోయారు. కొన్నేళ్లక్రితం నగరాలు, కార్యాలయాల్లో, ధనికుల ఇంట్లో మాత్రమే ఏసీలు కనిపించేవి. ఇప్పుడు గ్రామాల్లోకి కూడా ఏసీలు వచ్చేశాయి. ఏటేటా ఎండ తీవ్రత దృష్ట్యా ఇప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఏసీలకు అలవాటుపడిపోయారు. అయితే తాజాగా ఓ ఇంట్లో ఏసీ పేలిపోయిన ఘటన సంచలనంగా మారింది. హరియాణాలో ఈ షాకింగ్ ఘటన జరిగింది. ఏసీ పేలిపోయి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందారు. కుటుంబ సభ్యులతో పాటు కుక్క కూడా మృతి చెందింది. హరియాణాలోని ఫరీదాబాద్ లో ఘోర విషాదం జరిగింది. ఓ ఇంట్లో ఏసీ పేలి ముగ్గురు చనిపోయారు. అర్ధరాత్రి 1:30 గంటలకు ఏసీ పేలడంతో కుటుంబ సభ్యులు నిద్రలోనే శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. నాలుగు అంతస్తుల

## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ

- బీసీ హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించారని ఆరోపణ
- 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొం దిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో ఈరోజు ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె దుయ్యబట్టారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు ప్రధానంగా చర్చించారు.

## అంతర్జాతీయ ఆర్థిక సంస్థతో జీవీఎంసీ కీలక ఒప్పందం

- విశాఖ అభివృద్ధికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థ రుణం
- స్మార్ట్ వైజాగ్‌కు మరో ముందడుగు
- రూ.498 కోట్ల భారీ రుణం

2



**విశాఖపట్నం-నవభూమిబ్యూరో**

విశాఖపట్నం అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక ముందడుగు పడింది. నగర మౌలిక వసతుల కల్పన కోసం విశాఖ మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) తన సొంత ఆర్థిక పటిష్టతతో ఏకంగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (%×ఖీజ%) నుంచి భారీ రుణం సాధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సోమవారం నాడు జీవీఎంసీ, ఐఎఫ్‌సీ ప్రతినిధులు ఈ కీలక రుణ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా నగర పాలక సంస్థలు ఆర్థికంగా స్వయంప్రతిపత్తి సాధించే దిశగా

## ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ

- టీటీడీకి కొత్త ఈవో నియామకం
- రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ లకు స్థానచలనం
- టీటీడీ నూతన ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియామకం
- ప్రస్తుత ఈవో శ్యామలరావు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ
- రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు

2

**అమరావతి-నవభూమి ప్రతినిది**

ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా సీనియర్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను

## ఉప రాష్ట్రపతి ఎన్నికకు బీఆర్ఎస్ దూరం

- ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్
- రైతుల సమస్యలపై నిరసనగా ఈ నిర్ణయం
- యూరియా కొరతను పట్టించుకోవడం లేదు


బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు సురేశ్ రెడ్డి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు సురేశ్ రెడ్డి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే, అన్ని కోణాల్లో ఆలోచించి ఓటింగ్‌లో పాల్గొనకూడదని నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా కొరత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని, ఈ సమస్యను

## తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ వాయిదా..?



2

## కవిత సస్పెన్షన్‌పై తొలిసారి పెదవి విప్పిన కేటీఆర్

- కవిత సస్పెన్షన్‌పై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులు
- మా పార్టీ అంతర్గతంగా మాట్లాడి చర్యలు తీసుకుందన్న కేటీఆర్
- ఈ అంశం గురించి తాను మాట్లాడదలుచుకోలేదని వెల్లడి




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, తన సోదరి కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో కవిత సస్పెన్షన్ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. కవిత సస్పెన్షన్‌పై ఆయన మొదటిసారిగా స్పందించారు."కవితపై మా పార్టీ చర్చించి చర్యలు తీసుకుంది. చర్యలు తీసుకున్న తర్వాత ఇక నేను మాట్లాడటానికి ఏమీ లేదు" అని ఆయన స్పష్టం చేశారు. కవితపై వేటు అనేది పార్టీ అంతర్గతంగా చర్చించి తీసుకున్న నిర్ణయమని, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత వ్యక్తిగతంగా తాను దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని ఆయన తేల్చి చెప్పారు. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకున్నాక, దాని గురించి మాట్లాడి, విషయాన్ని పొడిగించదలుచుకోలేదని అన్నారు.

## తెలంగాణాలో స్కూళ్లు, కాలేజీలకు దసరా సెలవులివే

- 21 నుంచి అక్టోబర్ 3 వరకూ
- జూనియర్ కాలేజీలకు సెలవులు
  28 నుంచి అక్టోబర్ 5 వరకూ
- అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే విద్యావిరామం
- అక్టోబర్ 4, 6న తిరిగి తరగతులు ప్రారంభం

2



విద్యార్థులకు ఆట విడుపు

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

దసరా పండుగ వచ్చేస్తోంది. సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. అదే సమయంలో స్కూల్స్, కాలేజీలకు దసరా సెలవలపై ప్రకటన కూడా వచ్చేసింది. తెలంగాణలో అన్ని పాఠశాలలు, కళాశాలలకూ ఈసారి దసరా సెలవులు ఎప్పుడన్న దానిపై క్లారిటీ వచ్చేసింది. ఈ మేరకు అధికారులు సోమవారం కీలక ప్రకటన విడుదల చేసారు. స్కూళ్లకు, కాలేజీలకు వేర్వేరుగా సెలవుల్ని ఖరారు చేస్తూ అధికారులు ప్రకటన చేశారు. తెలంగాణలో ఈసారి దసరా సెలవుల్ని స్కూళ్లకు, కాలేజీలకు వేర్వేరుగానే ప్రకటించారు. ఇందులో ముందుగా స్కూళ్లకు దసరా సెలవుల్ని ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3 వరకూ ప్రకటించారు. అలాగే కాలేజీలకు మాత్రం ఈ

## రాజకీయాల్లోకి వైఎస్ రాజారెడ్డి?

- వైఎస్సార్ వారసత్వంలో మరో కొత్త ఎంట్రీ
- షర్మిల కుమారుడు రాజారెడ్డి రాజకీయ రంగప్రవేశం?
- నాలుగవ తరం నుంచి కాంగ్రెస్ వైపు అడుగు
- తల్లి షర్మిలతో కలిసి కర్నూల్ పర్యటన
- అమెరికాలో చదువుకున్న రాజారెడ్డి వ్యక్తిగత జీవితం



**అమరావతి-నవభూమి ప్రతినిది**

ఎవరీ రాజారెడ్డి అని ఆశ్చర్యపోనవసరం లేదు. వైఎస్సార్ కుటుంబంలోనే కొత్త తరం యువకుడు అని గుర్తుకుంచుకుంటే చాలు. నిజానికి రాజారెడ్డి అంటే వైఎస్సార్ తొలి తరం పేరు గుర్తుకు వస్తుంది. వైఎస్సార్ కి ఆయన తండ్రి. అయితే ఆ పేరుతో వైఎస్సార్ కి ఒక మనవడు ఉన్నాడు. వైఎస్ షర్మిల కుమారుడే ఈ రాజారెడ్డి. ఇపుడు నవతరం ప్రతినిధిగా రాజకీయాల్లోకి రాజారెడ్డి అడుగు పెడుతున్నారు అన్న ప్రచారం అయితే చక్కర్లు కొడుతోంది. తన తల్లి ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్వారానే అరంగేట్రం చేయడానికి రాజారెడ్డి చూస్తున్నారు అని అంటున్నారు. దానికి శుభారంభంగా తల్లి

## బాలకృష్ణ మరో రికార్డు.. ఎన్ఎస్ఈ బెల్ మోగించిన తొలి దక్షిణాది నటుడిగా గుర్తింపు



2

## పిడుగులతో కూడిన భారీ వర్షాలు



2

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్ మంగళవారం 09 । సెప్టెంబర్ । 2025


## నవ వార్త

## నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 14 గేట్లు ఎత్తివేత



**నల్లగొండ-నవభూమి:** నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. జలాశయం ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండి ఉండటంతో అధికారులు 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 1,66,586క్యూసెక్కుల వరద వస్తుండగా అంతే మొత్తంలో వదులుతున్నారు. స్పిల్‌వేద్వారా 1,12,518 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కుడి, ఎడమ కాలువలు, విద్యుత్ ఉత్పత్తి కోసం విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 589.40 అడుగులకు చేరింది.

సాగర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలకుగాను ఇప్పుడు 310.2522 టీఎంసీలు ఉన్నాయి. ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.





## తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ వాయిదా..?




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. దీంతో పంచాయతీ, పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యంగా జరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉంది. ఈనెల 30లోపు బిల్లులు ఎటూ తేలకపోతే.. హైకోర్టును ఆశ్రయించి ఎన్నికలకు మరింత గడువు కోరే యోచనలో ప్రభుత్వం ఉంది.బిహార్ ఎన్నికలు అయిపోయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందట. ఇందుకోసం హైకోర్టును రెండు నుంచి మూడు నెలల గడువు అడిగాలని చూస్తోందట. కాగా, ఆగస్టు 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ భేటీ అయింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు సిఫార్సు చేసింది.

## బాలకృష్ణ మరో రికార్డు.. ఎన్ఎస్ఈ బెల్ మోగించిన తొలి దక్షిణాది నటుడిగా గుర్తింపు



**ముంబై-నవభూమి:** ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ మరో అరుదైన గుర్తింపు సొంతం చేసుకున్నారు. ముంబైలోని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బెల్ మోగించిన తొలి దక్షిణాది నటుడిగా రికార్డు సృష్టించారు. ఎన్ఎస్ఈ అధికారుల ఆహ్వానం మేరకు బాలకృష్ణ.. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి బృందంతో కలిసి స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించారు బాలకృష్ణకు ఈ అరుదైన గౌరవం దక్కడంపై ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు .ఎన్ఎస్ఈలో ప్రత్యేక కార్యక్రమాలు, వేడుకల సందర్భంగా అతిథులు ఈ గంటను మోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్ఎస్ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బెల్ మోగించారు. ఐపీఓ ద్వారా తొలిసారి స్టాక్ మార్కెట్‌లో కాలుపెట్టే కంపెనీలు కూడా బెల్ మోగించి నిధుల సమీకరణ ప్రారంభించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. గతంలో నటుడు అజయ్ దేవ్‌గణ్ కూడా తన మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఎన్ఎస్ఈ గంట మోగించారు.

## పిడుగులతో కూడిన భారీ వర్షాలు



**అమరావతి-నవభూమి ప్రతినిధి** దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలకు ఆనుకుని వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో మంగళవారం నాడు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది.
చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, భారీ హోర్డింగులు వద్ద ఉండవద్దని ప్రజలకు సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు విశాఖపట్నం జిల్లా పెందుర్తిలో 80.5 మి.మీ., అనకాపల్లి జిల్లా కె.కోటపాడులో 68 మి.మీ., గంగవరంలో 61.5 మి.మీ., శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో 55 మి.మీ. చొప్పున అధిక వర్షపాతం నమోదు అయిందని వెల్లడించింది.

## ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ

**(1వపేజీ తరువాయి)**నియమించారు.ప్రస్తుతం టీటీడీ ఈవోగా పనిచేస్తున్న శ్యామలరావును సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబును నియమించారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ముఖేశ్ కుమార్ మీనా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండే బాధ్యతలు చేపట్టనున్నారు.ఇతర ముఖ్య నియామకాల్లో భాగంగా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంతరామ్‌ను, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం నియమించింది. ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్, పరిశ్రమలు, కార్మిక శాఖ కమిషనర్‌గా శేషగిరిబాబును నియమించారు. ఎండోమెంట్ రెవెన్యూ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు.గత కొద్ది రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఏఎస్ అధికారుల పనితీరుపై సమీక్షలు జరిపారు. పరిపాలనలో వేగం పెంచేందుకు, అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. పనితీరును ప్రామాణికంగా తీసుకుని, సమర్థులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించాలనే లక్ష్యంతో ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## హైదరాబాద్‌లో భారీగా... రద్దయిన రూ.500, రూ. 1000 నోట్ల పట్టివేత


**హైదరాబాద్-నవభూమి:**తొమ్మిదేళ్ల క్రితం రద్దయిన రూ.500, రూ.1000 నోట్లను ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నారాయణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంకు వద్ద ఇద్దరిని, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద ఉన్న మూడు బ్యాగుల్లో తనిఖీలు చేయగా రూ.2 కోట్ల విలువ చేసే రద్దయిన నోట్లు కనిపించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# రైలు ప్రయాణికులకు తీపి కబురు..



**హైదరాబాద్-నవభూమి:** రెండు తెలుగు రాష్ట్రాల్లో దసరా పండగ హడావుడి మొదలైంది. అప్పుడే బస్సులు, ట్రైన్లలో ముందస్తు రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయి. సొంతూళ్లకు వెళ్లే చాలా మంది అడ్వాన్స్ రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. ఇక పండుగ సీజన్ సమీపిస్తుండటంతో ట్రైన్లలో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. టికెట్లు దొరక్క, రైళ్ల కోసం గంటల తరబడి ఎదురుచూసే వలస కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మధ్య రైల్వే ఒక శుభవార్త చెప్పింది. మహారాష్ట్రలోని ముంబయి, భీవండి ప్రాంతాల్లో జీవనోపాధి కోసం వెళ్లిన వేలాది మంది వలస కార్మికులకు ప్రయోజనం కలిగేలా ముంబయి-కరీంనగర్ మధ్య ప్రత్యేక రైలును నడపనుంది. ఈ రైలు ఈ నెల 30 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటుంది.రైలు నంబరు 01153 ముంబయి నుంచి కరీంనగర్‌కు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముంబయిలోని లోక్‌మాన్య తిలక్ టెర్మినల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. కరీంనగర్ నుంచి ముంబయికి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి గురువారం మధ్యాహ్నం 1.40 గంటలకు ముంబయి చేరుకుంటుంది. ఈ రైలు మార్గమధ్యలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఆగుతుంది. ఈ ట్రైన్ కేవలం పండుగ రద్దీని తగ్గించడమే కాకుండా, బాసర, నాసిక్, షిర్డీ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు కూడా అనుకూలంగా ఉంటుంది.
ప్రస్తుతానికి ఈ రైలు కరీంనగర్ వరకు మాత్రమే నడుస్తున్నప్పటికీ దీన్ని కాగజ్‌నగర్ వరకు పొడిగిస్తే ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి ప్రయాణికులకు కూడా మహారాష్ట్ర నుంచి కనెక్టివిటీ లభిస్తుంది. కరీంనగర్‌లో ఈ రైలు 9 గంటల పాటు నిలిచి ఉంటుంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని కాగజ్‌నగర్ వరకు రైలును నడిపితే అదనంగా 4 నుంచి 5 గంటల సమయం పడుతుంది. కాగజ్‌నగర్‌లో వాటరింగ్ వంటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉండటం దీనికి సానుకూలం. అలాగే ప్రధాన పట్టణమైన జగిత్యాలలో కూడా రైలుకు హాల్టింగ్ కల్పిస్తే ఈ ప్రత్యేక రైలు ప్రయోజనం మరింత నెరవేరుతుందని ప్రయాణికులు కోరుతున్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి పండుగలకు స్వగ్రామాలకు వచ్చే వారికి, తిరిగి పని ప్రదేశాలకు వెళ్లే వారికి ఈ ప్రత్యేక రైలు చాలా ఉపశమనం కలిగిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో వేలాది మంది ప్రయాణికుల పండుగ ప్రయాణం సుఖమయం కానుంది.

## కంప్యూటర్‌గా మారనున్న టీవీ..టీ-ఫైబర్ కనెక్షన్‌తో సేవలన్నీ నట్టింట్లోకే..!



**హైదరాబాద్-నవభూమి:** ఇంటర్నెట్, టీవీ, ఓటీటీ సేవలను అతి తక్కువ ధరకే అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం టీ-ఫైబర్ ప్రాజెక్టును సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టును దసరా తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రూ. 3,500 కోట్ల వ్యయంతో ఈ నెట్‌వర్క్ మొదటి దశలో గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి రానుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 42 వేల కిలోమీటర్ల మేర భూగర్భంలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేశారు. సాధారణంగా పట్టణాల్లో ప్రారంభమయ్యే ఇలాంటి ప్రాజెక్టులను గ్రామీణ ప్రాంతాల నుంచే మొదలుపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.ప్రస్తుతం, రంగారెడ్డి, నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ప్రారంభం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేలకు పైగా గ్రామాల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మార్కెట్‌లో ఉన్న పెద్ద కంపెనీల ప్రాథమిక ప్లాన్‌ల ధరకే టీ-ఫైబర్ పూర్తిస్థాయి ప్లాన్‌లను అందిస్తుంది. టీ-ఫైబర్ కనెక్షన్ తీసుకున్న వారికి ఒక సెట్‌టాప్ బాక్స్ ఇస్తారు. ఈ బాక్స్ ద్వారా పాత సీఆర్టీ టీవీలు కూడా స్మార్ట్ టీవీలుగా మారి, వైఫై, టీవీ చానల్స్, ఓటీటీ సేవలను అందిస్తాయి. వెబ్‌కెమెరా అనుసంధానించుకుంటే వీడియో కాల్స్ కూడా చేసుకోవచ్చు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యవంతంగా ఉంటుంది. కరెంటు, గ్యాస్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల వివరాలు, ఆన్‌లైన్ పోల్స్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. డాష్‌బోర్డ్ ద్వారా ముఖ్యమంత్రి నేరుగా లబ్ధిదారులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడ వచ్చు. టీవీ రిమోట్‌ను ఫోన్‌గా వాడుకునేలా కొత్త టెక్నాలజీని తీసుకువస్తు న్నారు. వైఫై ద్వారా ఎలాంటి చార్జీలు లేకుండా ఫోన్లు మాట్లాడుకోవచ్చు. దీనికి టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి కోసం చర్చలు జరుగుతున్నాయి. ఒక రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో ఒక టీవీ, ఒక స్మార్ట్‌ఫోన్, ఒక ట్యాబ్, ఒక ల్యాప్‌టాప్‌లో లాగిన్ అయ్యే అవకాశం ఉంటుంది.
ఈ ప్రాజెక్టును పబ్లిక్-ప్రైవేట్-పార్ట్‌నర్‌షిప్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెట్‌టాప్ బాక్స్‌ల మరమ్మతులు, కస్టమర్ కేర్ సేవలను ఈ పద్ధతిలో అందిస్తారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, సుమారు 35 వేల మందికి ఉపాధి కల్పించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా, లోకల్ కేబుల్ ఆపరేటర్లకు కూడా ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కల్పించనున్నారు. వారికి శ్రీ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. మహబూబ్‌నగర్, జనగామ, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల, వికారాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, గద్వాల, నారాయణపేట, వనపర్తి, వరంగల్ రూరల్ జిల్లాల్లో టీ-ఫైబర్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

## నిజాయితీకి నిలువుటద్దం.. రూ. 16 లక్షల బంగారం తిరిగిచ్చిన ఆటో డ్రైవర్



**నిర్మల్-నవభూమి:** కష్టపడి పనిచేసే సామాన్యులకు నిజాయితీ ఎక్కువ. తమ శ్రమతో సంపాదించిన అర్ధ రూపాయి అయినా వదలుకోరు. తమది కానిది పది రూపాయలైనా పట్టించుకోరు. నిర్మల్ జిల్లాకు చెందిన ఈ ఆటో డ్రైవర్ కూడా అంతే. నడిరోడ్డుపై తనకు దొరికిన రూ. 16 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఉన్న సంచిని పోగొట్టుకున్న మహిళకు తిరిగి ఇచ్చి తన నిజాయితీని, గొప్ప మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లాలోని కడెం గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ నిర్మల్‌లో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఆమె తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు వెళ్తున్నారు. తన కుమార్తె పెళ్లి కోసం చేయించిన 16 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు, ముఖ్యమైన గుర్తింపు పత్రాలను ఒక సంచిలో పెట్టుకుని వాహనానికి తగిలించారు. అయితే మార్గమధ్యలో కొండాపూర్ సమీపంలోని బైపాస్ వద్ద ఆ సంచి కింద పడిపోయింది. ఈ విషయాన్ని వారు గమనించుకోలేకపో యారు.అదే సమయంలో లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో ప్రయాణికులతో నిర్మల్ నుంచి కనకాపూర్ వైపు వెళ్తున్నారు. ఆయన ఆటోలోని ప్రయాణికుంాలైన సౌజన్య రోడ్డుపై పడి ఉన్న ఆ సంచిని చూసి ఆటో డ్రైవర్ సాయి కుమార్‌కు చెప్పారు. వెంటనే ఆటో ఆపి ఆ సంచిని తీసుకుని తన ఇంటికి వెళ్లారు. బంగారం పోయిందని సుజాత సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయగా.. దానిని చూసిన సౌజన్య తన భర్త ద్వారా ఆటో డ్రైవర్ సాయికుమార్‌కు ఈ విషయం తెలియజే శారు. ఆదివారం రోజు సాయి కుమార్ బాధితురాలికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి సంచిని అందుకున్నారు. సాయి కుమార్ బంగారంతో పాటు, నగదు, గుర్తింపు పత్రాలను సుజాతకు భద్రంగా అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన సాయి కుమార్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించి అభినందించారు. తనది కాని వస్తువును తిరిగి ఇచ్చి సాయి కుమార్ చూపిన మానవత్వం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సంఘటన నిజాయితీకి, మానవత్వానికి నిలువుటద్దంలా నిలిచింది. కష్టజీవుల నిజాయితీ ఎంత గొప్పదో మరోసారి రుజువు చేసింది.


## అంతర్జాతీయ ఆర్థిక సంస్థతో జీవీఎంసీ కీలక ఒప్పందం

**(1వపేజీ తరువాయి)**జీవీఎంసీ దేశానికే ఒక కొత్త మార్గాన్ని చూపింది.
ప్రాజెక్టు వివరాలు, ప్రయోజనాలు
విశాఖలోని మధురవాడ జోన్-2లో అత్యాధునిక మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఈ రుణం ఉపయోగించనున్నారు. మొత్తం రూ.553 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఐఎఫ్‌సీ రూ.498 కోట్లను రుణంగా అందిస్తోంది. మిగిలిన మొత్తంలో రూ.45.64 కోట్లను అమృత్ 2.0 పథకం కింద, మరో రూ.9.36 కోట్లను జీవీఎంసీ తన సొంత నిధుల నుంచి భరించనుంది. విశేషమేమిటంటే, ఈ రుణాన్ని జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల నుంచే 15 ఏళ్లలో తిరిగి చెల్లించనుంది. దీనికి 8.15 శాతం ఫ్లోటింగ్ వడ్డీ రేటు వర్తిస్తుంది.
రాబోయే 30 ఏళ్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా 100 శాతం భూగర్భ డ్రైనేజీ నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్, లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగం, రీసైక్లింగ్ చేస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంతంలో అంటువ్యాధులు తగ్గడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. పర్యావరణ పరిరక్షణకు, వరద నీటి నిర్వహణకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.

**రైతుల సమస్యలపై సీఎం దృష్టి**

ఈ కీలక ఒప్పందం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, ఇతర పాలనాపరమైన అంశాలపై ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులను కఠినంగా ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ ఉందని, మరో 10 రోజుల్లో అదనంగా 23,592 మెట్రిక్ టన్నులు రానుందని అధికారులు తెలిపారు.అదేవిధంగా, ఉల్లి రైతులు నష్టపోకుండా క్వింటాలుకు కనీస ధర రూ.1200 తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తురకపాలెం గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగుమందు డబ్బాతో ఆత్మహత్య నాటకమాడిన వారిపై విచారణ జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ

## అల్లు కనకరత్నం పెద్దకర్మ కార్యక్రమానికి హాజరైన పవన్ కల్యాణ్, అకీరా...



**హైదరాబాద్-నవభూమి:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన కుమారుడు అకీరా నందన్‌తో కలిసి అల్లు కనకరత్నమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి, మెగాస్టార్ చిరంజీవి అత్తగారైన అల్లు కనకరత్నమ్మ ఇటీవల కన్నుమూసిన సంగతి తెలిసిందే.ప్రఖ్యాత హాస్యనటుడు అల్లు రామలింగయ్య అర్ధాంగి కనకరత్నమ్మ (94) వృద్ధాప్య సమస్యల కారణంగా కొన్ని రోజుల కిందట తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో హైదరాబాద్ శివారులోని కోకాపేటలో నిర్వహించారు.ఈ నేపథ్యంలో, హైదరాబాదులో దశ దిన కర్మకాండలు నిర్వహించారు.

## నేడే ఉప-రాష్ట్రపతి ఎన్నిక

**(1వపేజీ తరువాయి)**ఓట్లు వస్తాయి. ఇక, ప్రతిపక్ష ఇండియా కూటమికి మొత్తం 324 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఎన్నికలు 2022 కంటే ఆసక్తిగా మారాయి. ఎందుకంటే గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షం మెరుగైన ప్రదర్శన చేయడంతో ఎంపీల సంఖ్య పెరిగింది. కానీ, 100 శాతం ప్రతిపక్ష ఎంపీలు జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి ఓటు వేసినా.. ఆయనపై ఎన్డీయే అభ్యర్థి 100 నుంచి 135 ఓట్ల తేడాతో గెలిచే అవకాశాలు ఉన్నాయి.అయితే, త్వరలోనే బిహార్, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమ బలాన్ని నొక్కిచెప్పడానికే ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాలు తమ అభ్యర్థిని నిలబెట్టాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్‌కు గోదావరి జలాలు

**(1వపేజీ తరువాయి)**చురకలంటించారు. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు తీసుకు రావట్లేదన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచే హైదరాబాద్‌కు గోదావరి జలాలు వస్తున్నాయని వివరించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కట్టింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రాణహిత-చేవెళ్లతో రంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. త్వరలో మహారాష్ట్ర వెళ్లి అక్కడి సీఎంతో మాట్లాడతానన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణంపై వారితో చర్చలు జరుపుతామని తెలిపారు.పదేళ్లలో మూసీ ప్రక్షాళనపై కేసీఆర్ ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. మూసీ నది ప్రక్షాళన హైదరాబాదులో ఎందుకు చేసుకోకూడదంటూ ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మోదీ, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా తమ తమ రాష్ట్రాల్లోని నదులను ప్రక్షాళన చేసుకోవచ్చా? అంటూ వ్యంగ్యంగా బీజేపీ నేతలను ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందనే వారి భయమన్నారు. మూడు నెలల్లో ప్రపంచ నగరాల్లో హైదరాబాద్‌ను మేటిగా తీర్చిదిద్దుతామని చెప్పారు.కాంగ్రెస్ సీఎంల ప్రణాళికల వల్లే హైదరాబాద్ ఈ స్థాయికి చేరుకుందని వివరించారు. కడుపులో విషం పెట్టుకుని ప్రాజెక్టులు ఆపకండంటూ ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. కలిసి రండి.. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం తిప్పికొడుతుందన్నారు.
మూసీ పునరుజ్జీవ పథకానికి శ్రీకారంలో భాగంగా ఈ రోజు.. గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను మంచినీటితో నింపేలా ప్రణాళికలు రూపొందించారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ పథకాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.7,658 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపడుతుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

## పేలిపోతున్న ఏసీలు


**(1వపేజీ తరువాయి)**బిల్డింగ్ లోని ఫస్ట్ ఫ్లోర్ లో ఈ విషాదం జరిగింది. ఈ ఘటనలో భార్యాభర్తలతో పాటు కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. వీరితోపాటు పెంపుడు కుక్క కూడా చనిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో సచిన్ కపూర్, ఆయన సతీమణి రింకూ, కూతురు సుజన్ ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. అయితే వేరే గదిలో నిద్రిస్తున్న కుమారుడు కిటికీ నుంచి కిందకు దూకేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. భారీ పేలుడు సంభవించడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకుని పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏసీలు ఎందుకు పేలుతాయి..? ఏసీలు పేలడానికి అనేక కారణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా ఏసీలు సరిగ్గా పనిచేయకపోవడం లేదా లో మెయింటెనెన్స్ కారణంగా జరుగుతుందని అంటున్నారు. ముఖ్యంగా ఏసీ లోని కంప్రెషర్ వేడెక్కడం వల్ల పేలుడు సంభవించే అవకాశం ఉంది. అది ఎక్కువ సమయం పనిచేసి, బ్రేక్ లేకుండా కొనసాగితే వేడి ఎక్కువగా వస్తుంది. ఈ వేడిమి పెరిగినప్పుడు మంటలు చెలరేగే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అలాగే ఓల్డ్ లేదా దెబ్బతిన్న పైపుల ద్వారా రిఫ్రిజిరేటర్ గ్యాస్ లీక్ కావడం వల్ల ఈ గ్యాస్ మంటలు చెలరేగి పేలుడుకు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది ఎక్కువగా పాత ఏసీల్లో కనిపిస్తుంది. ఇక ఏసీలోని ఎలక్ట్రికల్ వైర్లను సరిగ్గా జత చేయకపోయినా లేదా తగిన మార్పిడి లేకుండా ఉపయోగించితే షార్ట్ సర్క్యూట్ కారణంగా పేలే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దాంతోపాటు ఏసీలోని ఫిల్టర్ బ్లాక్ అయినప్పుడు, మురికి, దుమ్ము వల్ల యూనిట్ సరిగ్గా పనిచేయకపోయినా.. అలాగే విద్యుత్ సరఫరాలో వేగంగా పెరుగుదల లేదా తగ్గుదల ఏర్పడినా ఇలాంటి సంఘటనలు ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ జాగ్రత్తలు తీసుకుంటే.. ఏసీలను ఉపయోగించేవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎయిర్ ఫిల్టర్లను మార్చడం, అవుట్ డోర్ యూనిట్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చూసుకోవడం, కంప్రెషర్ చుట్టూ తగినంత ఖాళీ ఉండేలా చేయడం, ఓవర్ లోడ్ కాకుండా చూసుకోవడం చేయాలని చెబుతున్నారు.

## తెలంగాణాలో స్కూళ్లు, కాలేజీలకు దసరా సెలవులివే

**(1వపేజీ తరువాయి)**నెల 28 నుంచి అక్టోబర్ 5 వరకూ ప్రకటించారు. దీంతో ఆయా స్కూళ్లు, కాలేజీల విద్యార్థుల్ని వీటిని గమనించి సెలవులకు ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది. " తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం కోసం ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే ఈ సెలవుల్ని ఇస్తున్నారు. స్కూళ్లకు సెలవులు అక్టోబర్ 3 వరకూ ఇవ్వడంతో 4వ తేదీన విద్యార్థులకు తిరిగి పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుంది. జూనియర్ కాలేజీలకు మాత్రం అక్టోబర్ 5 వరకూ సెలవులు ప్రకటించడంతో అక్టోబర్ 6న వారు తిరిగి కాలేజీలకు రావాల్సి ఉంటుంది. ఈ మేరకు అధికారులు స్కూళ్లు, కాలేజీలకు క్లారిటీ ఇస్తున్నారు. అలాగే సెలవుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికకు..

**(1వపేజీ తరువాయి)**పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలుమార్లు కోరినా వారు విఫలమయ్యారని సురేశ్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వాల వైఫల్యానికి నిరసన తెలిపేందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నామని, బ్యాలెట్‌పై 'నోటా'కు అవకాశం లేనందున ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉంటున్నామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తోందని కూడా ఆయన ఆరోపించారు.రేపు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇద్దరు అభ్యర్థుల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని, వారు తమ రంగాల్లో నిష్ణాతులని సురేశ్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక అభ్యర్థి తమ రాష్ట్రానికి చెందినవారే అయినప్పటికీ, రైతుల సమస్యలకే తమ పార్టీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం..

**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూ కశ్మీర్ కుల్గామ్ జిల్లాలో సోమవారం భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ ఘటనలో ముగ్గురు సైనికులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. కుల్గాంలోని గుదార్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం మేరకు భద్రతా దళాలు వారి



కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయని ఆ అధికారి పేర్కొన్నారు. భద్రతా దళాలను గమనించిన ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరిపారు.దాంతో భద్రతా బలగాలు సైతం ఆత్మరక్షణగా కాల్పులు జరుపడంతో సెర్చ్ ఆపరేషన్ ఎన్‌కౌంటర్‌గా మారిందని శ్రీనగర్‌కు చెందిన చినార్ కార్ప్స్ ఆఫ్ ఆర్మీ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. అప్రమత్తంగా ఉన్న దళాలు అనుమానాస్పద కదలికలను గుర్తించాయని.. ఉగ్రవాదులు కాల్పులు జరుపడంతో జూనియర్ కమిషన్డ్ అధికారితో సహా ముగ్గురికి గాయాలయ్యాయని తెలిపింది. ఇన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పింది. ఆపరేషన్‌లో గాయపడ్డ సైనికులను వైద్యం కోసం తరలిస్తున్నట్లు చెప్పింది. ఉగ్రవాదుల గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నామని.. ప్రస్తుతం సంఘటనా స్థలంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని సైన్యం వివరించింది.

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
మంగళవారం
09 । సెప్టెంబర్ । 2025

## కోల్‌కతాలో కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్.. ఎప్పటి నుంచి అంటే..!



**కోల్‌కతా-నవభూమి:** భారత సాయుధ బలగాలు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో 'కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నాయి. ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు ఈ కాన్ఫరెన్స్ కొనసాగనుంది. 'ఇయర్ ఆఫ్ రిఫార్మ్స్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఫర్ ద ఫ్యూచర్ అనేది కాన్ఫరెన్స్ థీమ్‌గా నిర్ణయించారు. భారత రక్షణ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది.'ఈ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2025' ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రక్షణ శాఖ సహాయ మంత్రి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, రక్షణ శాఖ కార్యదర్శి తదితరులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. అదేవిధంగా త్రివిధ దళాలకు చెందిన అధికారులు, ఇతర మంత్రిత్వ శాఖల కార్యదర్శులు కూడా కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారు.


## ప్రేమించిన వ్యక్తితో వివాహం.. పెళ్లైన 4 నెలలకే నవవధువు ఆత్మహత్య



**తిరువనంతపురం-నవభూమి:** చాలా కాలంగా ప్రేమించుకున్న జంట వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అయితే పెళ్లైన నాలుగు నెలలకే నవవధువు ఆత్మహత్య చేసుకున్నది. దీంతో రెండు కుటుంబాలు షాక్ అయ్యాయి. కేరళలోని కాసరగోడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పెరియ అయంపరకు చెందిన 21 ఏళ్ల నందన, అరమంగనం ప్రాంతానికి చెందిన రంజేష్ చాలా కాలంగా రిలేషన్‌లో ఉన్నారు. చివరకు వారి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించాయి. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 26న బంధువులు, స్నేహితుల సమక్షంలో వారి వివాహం ఘనంగా జరిగింది.

కాగా, పెళ్లైన నాలుగు నెలలకే నందన అనూహ్య నిర్ణయం తీసుకున్నది. ఆదివారం మధ్యాహ్నం తన జీవితాన్ని ముగిస్తున్నట్లు తల్లికి మెసేజ్‌తో పాటు ఉరి ఏర్పాటు ఫొటో పంపింది. భర్త ఇంట్లోని బెడ్ రూమ్‌లో సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.మరోవైపు మెసేజ్, ఫొటో చూసిన నందన తల్లి వెంటనే ఆమె అత్తింటి వారిని అప్రమత్తం చేసింది. డోర్ లాక్ చేసిన బెడ్‌రూమ్ తలుపులు బద్ధలుకొట్టి వారు లోనికి వెళ్లారు. నందన మృతదేహం సీలింగ్‌కు వేలాడటాన్ని చూసి షాకయ్యారు. ఆమె ఎందుకు సూసైడ్ చేసుకున్నదో అన్నది ఎవరికీ అర్థం కాలేదు.ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. నందన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అసహజ మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్‌లోకి టిక్‌టాక్ రీఎంట్రీ..? స్పష్టతనిచ్చిన కేంద్ర మంత్రి.. ఇంతకీ ఏం చెప్పారంటే..!




**బీజింగ్-నవభూమి:** చైనాకు చెందిన ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ సేవలు భారత్‌లో మళ్లీ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రచారంపై కేంద్రం తాజాగా స్పందించింది. టిక్‌టాక్ రీఎంట్రీ వార్తలను తోసిపుచ్చింది.ఈ మేరకు టిక్‌టాక్‌పై నిషేధాన్ని ఎత్తివేసే ప్రణాళిక పరిశీలనలో లేదని కేంద్ర ఐటీ, సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. మనీకంట్రోల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఈ విషయంపై ప్రభుత్వంలో ఎలాంటి చర్చలూ జరగలేదని వెల్లడించారు. భారత్‌లో టిక్‌టాక్‌పై విధించిన నిషేధం ఎత్తివేతకు సంబంధించిన ఎటువంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేశారు.భారతీయ, చైనా సైనిక బలగాల మధ్య గల్వాన్ ఘర్షణ తర్వాత భద్రతా కారణాలు చూపుతూ భారత ప్రభుత్వం 2020లో టిక్‌టాక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. టిక్ టాక్‌తోపాటు వందలాది చైనీస్ గేమింగ్ యాప్‌లను భారత ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత కూడా భారత్‌లో ఏదోవిధంగా కొనసాగేందుకు శాయశక్తులా ప్రయత్నించిన టిక్ టాక్ కంపెనీ ఎట్టకేలకు 2023 ఫిబ్రవరి 28న మూతపడింది. అప్పటి నుంచి భారత్‌లో అందుబాటులో లేదు. అయితే, ట్రంప్ సుంకాల మోతతో అమెరికా-భారత్ మధ్య కాస్త ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించినప్పటి నుంచి భారత్, చైనా మధ్య సంబంధాలలో పురోగతి కనిపిస్తోంది.భారత్‌కు ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాలను తవ్వే మిషన్ల ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు చైనా ఇటీవలే ప్రకటించింది. ఆ తర్వాత టియాంజిన్‌లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగిన షాంఘై సహకార సంస్థల(ఎస్‌సీఓ) సదస్సుకు ప్రధాని మోదీ హాజరైన విషయం తెలిసిందే. ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ పరిణామాలతో మళ్లీ భారత్‌లోకి అడుగుపెట్టబోతోందంటూ వార్తలు పుట్టుకొచ్చాయి. దీనిపై ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే క్లారిటీ ఇచ్చాయి కూడా. ఇప్పుడు ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా స్పష్టతనిచ్చారు.

## వరద నీటిలో పొలాలు.. ఎకరాకు రూ.20 వేల పరిహారం



**చండీఘడ్-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టం మిగిల్చాయి. ముఖ్యంగా పంజాబ్‌లో ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దాంతో పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం నీటి పాలైందని రైతులు తలలు పట్టుకున్నారు.దాంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు పంజాబ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీట మునిగిన ప్రతి ఎకరా పంటకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించింది. పంజాబ్ సీఎం కార్యాలయం సోమవారం అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది.

# వరదల్లో ఇరుక్కున్న ప్రజలను పరామర్శిస్తూ వారి భుజాలపై ప్రయాణం




**న్యూఢిల్లీ-నవభూమి:** కుండపోత వర్షాల కారణంగా బీహార్‌లోని కతిహార్ జిల్లాలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. వరదలు, నీటిమట్టం పెరగడంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్లిష్ట సమయంలో స్థానిక కాంగ్రెస్ ఎంపీ తారీఖ్ అన్వర్ వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించడం మొదట ప్రశంసనీయంగా అనిపించినా.. ఆయన పర్యటించిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. రాజకీయ ప్రత్యర్థులు ఈ సంఘటనను వ్యతిరేకిస్తూ ఎంపీని విమర్శిస్తున్నారు.సాధారణంగా ప్రజలు వరద నీటిలో నడుస్తూ తమ సమస్యలను పంచుకుంటే.. ఎంపీ మాత్రం నీటిలో దిగకుండా గ్రామస్థుల భుజాలపై కూర్చుని పర్యటించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ఈ విషయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఎంపీ తారీఖ్ అన్వర్ అనారోగ్యంతో ఉన్నందున.. ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు స్వచ్ఛందంగా ఆయన్ను భుజాలపై మోసుకెళ్లారని పార్టీ నాయకులు వివరించారు.కతిహార్ ఎంపీగా ఉన్న తారీఖ్ అన్వర్.. వరద పరిస్థితిని స్వయంగా అంచనా వేయడానికి రెండు రోజుల పాటు తన నియోజక వర్గంలో పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన ట్రాక్టర్‌లు, పడవలు వంటి వివిధ రకాల రవాణా మార్గాలను ఉపయోగించారు. ఒకచోట బురద కారణంగా వాహనం ముందుకు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. అక్కడి నుంచి సుమారు రెండు కిలో మీటర్ల దూరం కాలి నడకన వెళ్లాలి. అదే సమయంలో ఎండ తీవ్రత కూడా అధికంగా ఉండటంతో.. వృద్ధుడైన ఎంపీ అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు తలతిరుగుతున్నట్లు చెప్పడంతో.. గ్రామస్థులు ఆయనపై చూపిన ప్రేమ, గౌరవంతో ఆయన్ను భుజాలపై మోసుకెళ్లారు. ఒక పోలీస్ అధికారి కూడా వారికి సహాయం చేశారు. ఇది స్వచ్ఛందంగా జరిగిన సంఘటన తప్పే.. దీని వెనుక ఎలాంటి ఉద్దేశం లేదని కతిహార్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సునీల్ యాదవ్ స్పష్టం చేశారు.ఈ పర్యటన అనంతరం ఎంపీ తారీఖ్ అన్వర్ తన ఎక్స్ ఖాతాలో కొన్ని చిత్రాలను, వీడియోలను పంచుకున్నారు. వరద బాధితులకు తన సంఘీభావాన్ని తెలియజేస్తూ.. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, వారికి తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అయితే ఆయన పర్యటించిన తీరుపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. తమ నాయకులు ప్రజల భుజాలపై ఎక్కి వారి కష్టాలను చూడటాన్ని బీజేపీ "వి.వి.ఐ.పి. సంస్కృతి"గా అభివర్ణించింది.అయితే కష్టంలో ఉన్న ప్రజల పట్ల నిజమైన సానుభూతి, సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ పర్యటన జరిగిందని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోంది. ఈ వివాదం రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సంఘటన బీహార్‌లోని ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని, అలాగే ప్రజల కష్టాల పట్ల నాయకుల బాధ్యతను సూచిస్తుంది.

# మహిళ ప్రాణం కాపాడిన మొసలి



**లక్నో-నవభూమి:** సాధారణంగా మొసలి పేరు వింటేనే చాలా మంది భయపడిపోతుంటారు. వామ్మో మొసలా అంటుంటారు. ఎందుకంటే అది అందరినీ కరుస్తుంది. నమిలి మింగేస్తుంది. ప్రాణాలు కూడా తీసేస్తుందని. కానీ ఇలాంటి ఓ మొసలే... ఓ మహిళ ప్రాణాలు కాపాడింది. ముఖ్యంగా ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు ఆమె గంగానదిలో దూకగా.. మొసలి కనిపించింది. దీంతో భయపడిపోయిన ఆమె వెంటనే దగ్గర్లో ఉన్న చెట్టుపైకి ఎక్కేసింది. అలా ఆమె ప్రాణాలు నిలవగా.. అంతా ఆశ్చర్యపోతున్నారు. అసలీ ఘటన ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి.ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. వ్యక్తిగత సమస్యల వల్ల తీవ్ర మనోవేదనకు గురైన ఒక మహిళ తన జీవితాన్ని ముగించుకోవాలని నిర్ణయించుకుంది. నిశ్శబ్దంగా గంగా నది దగ్గరకు వెళ్లి.. ఎవరూ చూడకముందు నీళ్లలోకి దూకింది. ఇంకాసేపట్లో నీళ్లలో మునిగిపోతుందనగా.. ఓ భయంకరమైన దృశ్యం ఎదురైంది. తన వైపు వేగంగా వస్తున్న ఒక పెద్ద మొసలి కనిపించింది. ఆ మృగం కళ్లు, నోరు ఆమెను తీవ్రంగా భయపెట్టాయి. ఆ క్షణంలో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన పూర్తిగా మర్చిపోయిన ఆమె.. తన ప్రాణాలను రక్షించుకోవాలనే ప్రవృత్తి బలంగా మేల్కొంది. ఇలా ఆమెకు తెలియకుండానే బతకాలనే కోరిక మరింత బలమైంది.క్షణాల్లోనే మొసలి బారిన పడకుండా ఉండేందుకు ఆమె.. తన దగ్గర్లో ఉన్న ఒక చిన్న చెట్టును చూసి ఎలాగైనా దాన్ని చేరుకోవాలని నిర్ణయించుకుంది. ప్రాణభయంతో భీకరమైన వేగంతో ఈదుతూ.. ఆ మొసలికి దొరక్కుండా జాగ్రత్తగా తప్పించుకుంది. ఆమె ఆ చెట్టును చేరుకుని దానిపైకి ఎక్కి తన ప్రాణాలను కాపాడుకోవడానికి బిగ్గరగా అరవడం మొదలుపెట్టింది. ఆమె కేకలను విన్న గ్రామస్థులు ఆ వైపుగా చూసి ఆశ్చర్యపోయారు. ఒక మహిళ నది మధ్యలో ఉన్న చెట్టును పట్టుకుని అరుస్తున్న దృశ్యాన్ని గమనించి ఆమెను కాపాడాలనుకున్నారు.ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా పడవలో వచ్చి ఆమెను రక్షించారు. సురక్షితంగా చెట్టు మీద నుంచి పడవలోకి దింపి ఒడ్డుకు చేర్చారు . ఆమె పరిస్థితి చూసి గ్రామస్థులంతా ఆశ్చర్యంపోయారు. ముఖ్యంగా ఆమె కథ విని.. మొసలే మీ ప్రాణం కాపాడిందని చెప్పారు. ముఖ్యంగా మొసలి నుంచి ప్రాణాలను రక్షించుకోవడానికి పోరాడిన ఆమె ధైర్యాన్ని అభినందించారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి.. కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు.

## ఉత్తరప్రదేశ్‌లో సంచలనం.. అందరి ముందే బీజేపీ ఎంపీ సోదరిపై అత్తింటివారి దాడి



**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు ఎలాంటి కష్టాలు ఉండవని చాలా మంది భావిస్తారు. కానీ వారికి కూడా అత్తింటి వేధింపులు తప్పడం లేదని రుజువు చేసే ఒక భయంకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఫరూఖాబాద్‌కు చెందిన బీజేపీ ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్ సోదరి రీనా రాజ్‌పుత్ తన అత్తింటివారి వేధింపులకు గురయ్యారు. భర్త కుటుంబం తరచుగా వేధింపులకు పాల్పడడంతో.. సహనం కోల్పోయిన ఆమె ఎదురు తిరిగింది. భర్తతో పాటు అత్తమామలను ప్రశ్నించగా.. అందరూ చూస్తుండగానే ఆమెపై కర్రలతో దారుణంగా దాడి చేశారు. ఈ ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.రీనా రాజ్‌పుత్‌కు 17 ఏళ్ల క్రితం ఇటా జిల్లా రాణి అవంతి బాయి నగర్‌కు చెందిన ఒక వ్యక్తితో వివాహం జరిగింది. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా ఓ పాప కూడా పుట్టింది. కొంతకాలం పాటు సాఫీగా సాగిన వీరి వైవాహిక జీవితంలో చిన్న చిన్న గొడవలు ప్రారంభం అయ్యాయి. ముఖ్యంగా అత్తింటి వారంతా వేధింపులకు పాల్పడడం మొదలు పెట్టారు. ఎలాగైనా రీనాను ఇంట్లో నుంచి వెళ్లగొట్టాలని చూసిన మెట్టినింటి వాళ్లు.. ఆమెను చిత్రహింసలకు గురిచేయడం ప్రారంభించారు. ఒకరోజు ఆమె స్నానం చేస్తుండగా ఆమె మామ, బావ రహస్యంగా వీడియో తీశారు. దీన్ని గమనించి ఆమె వారిని గట్టిగా నిలదీశారు.ఇదేంటని ఆగ్రహంతో ప్రశ్నించగా.. క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాల్సింది పోయి ఆమెపైనే దాడికి పాల్పడ్డారు. తమపైకే నోరు లేపి, ప్రశ్నించడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయిన మామ.. ఆమెను తుపాకీతో కొట్టారు. ఆ దెబ్బల నుంచి తప్పించుకోవడానికి రీనా బయటకు పరుగెత్తగా.. ఆమె బావమరిది వీధిలో ఇనుప రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆపై ఇంట్లోని వాళ్లంతా బయటకు వచ్చి ఆమెను ఇష్టం వచ్చినట్లుగా కొట్టారు. ఈక్రమంలోనే ఆమె గట్టి గట్టిగా కేకలు వేస్తూ ఏడ్వగా.. స్థానికులంతా గుమిగూడారు. సెల్ ఫోన్లతో వీడియోలు తీశారే తప్ప ఈ దారుణాన్ని ఏ ఒక్కరు కూడా అడ్డుకోలేకపోయారు.తీవ్ర గాయాలపాలైన రీనా ఎలాగోలా వారి నుంచి తప్పించుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తనకు జరిగిన అన్యాయం గురించి వివరించి మరీ ఫిర్యాదు చేశారు. చాలా కాలంగా తన అత్తమామలు సహా భర్త వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తనపై నిత్యం లాఠీలు, కర్రలతో దాడి చేస్తున్నారని, తన కూతురిని కూడా హింసిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసుపై వెంటనే చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి హానీ జరగకుండా చూడాలని అధికారులను వేడుకున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. ఓ ఎంపీ సోదరి పరిస్థితే ఇంత దారుణంగా ఉందంటే.. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదంటూ వివరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై ఇలాంటా ఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. అలాగే ప్రజలు కూడా.. స్థానికంగా ఇలాంటివి జరిగినప్పుడు వెంటనే స్పందించి అడ్డుకోవాలని లేదంటే పోలీసులకైనా తెలపాలని సూచిస్తున్నారు.

### దొరికినవి రూ. 80 వేలు, పోగొట్టుకున్నది రూ. 2 లక్షలు

# దొంగల ప్లాన్ రివర్స్



**భోపాల్-నవభూమి:** సాధారణంగా దొంగలు దొంగతనం చేసిన తర్వాత పారిపోయేందుకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకుంటారు. బైకులో, ఇతర వాహనాలో వెంట తెచ్చుకుని మరీపారిపోయేందుకు సిద్ధంగా ఉంటారు. ఒకరో ఇద్దరో డబ్బు, నగలు, విలువైన వస్తువులు చోరీ చేస్తే మిగతా వారు వాహనం స్టార్ట్ చేసి పెడతారు. వారు వచ్చి ఎక్కిన వెంటనే పారిపోతుంటారు. ఇలాంటివి సినిమాలతో పాటు నిజ జీవితంలోనూ చాలానే చూశాం. కానీ మధ్య ప్రదేశ్‌లో ఇందుకు పూర్తి భిన్నంగా జరిగిందో దొంగతనం. ఓ వ్యాపారి నుంచి రూ.80 వేలు దొంగిలించిన ముగ్గురు చోరులు.. వారు వచ్చిన ఖరీదైన ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి కాలినడకన వెళ్లిపోయారు. ముఖ్యంగా 80 వేల రూపాయల కోసం 2 లక్షల బైకును పోగొట్టుకోవడంతో అంతా నవ్వుకుంటున్నారు. ఈ ఘటన మధ్యప్రదేశ్ భోపాల్‌లోని అయోధ్య నగర్లో గురువారం రాత్రి జరిగింది. నీరజ్ అనే కిరాణా వ్యాపారి తన షాపును మూసివేసి రూ. 80 వేల నగదు ఉన్న బ్యాగ్‌తో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో ముగ్గురు దొంగలు ఒక ఖరీదైన బైక్‌పై వచ్చి అతడిని అడ్డగించారు. వారిలో ఒకరు నీరజ్ చేతిలోని బ్యాగ్‌ను లాక్కోవడానికి ప్రయత్నించగా.. నీరజ్ ప్రతిఘటించారు. ఈ పెనుగులాటలో నీరజ్ స్కూటర్ కింద పడిపోయింది. ఈ క్రమంలో దొంగలు చాకచక్యంగా నగదు బ్యాగ్‌ను లాక్కోగలిగారు. అయితే దొంగలు బ్యాగ్‌తో పారిపోయేందుకు సిద్ధమయ్యేలోపే వారికి ఊహించని షాక్ తగిలింది. వారు వచ్చిన బైక్ ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. దీంతో వారికి భయం పట్టుకుంది. ఇంతలో నీరజ్ కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమై ఆ వైపుగా రావడం మొదలు పెట్టారు. పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన దొంగలు.. ఆందోళనతో దొంగలించిన బ్యాగ్‌ను తీసుకుని బైకును వదిలేసి పారిపోయారు. దీంతో నీరజ్ వారి బైకును తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బండి నెంబర్ ఆధారంగా దొంగలను గుర్తించారు.దొంగలంటే ఇలా ఉండాలబ్బా..! అయితే త్వరలోనే వారిని పట్టుకుంటారని పోలీసులు చెబుతున్నారు. ఒక సాధారణ దొంగతనం కేసులో ఇలాంటి విచిత్రమైన మలుపు రావడం చాలా అరుదు కాగా.. అంతా ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా ఈ వార్త నెట్టింట వైరల్ కాగా.. అంతా బాగైంది దొంగలకు అంటూ కామెంట్లు చేస్తున్నారు. దొంగలంటే ఇలా ఉండాలంటూ మరికొందరు చెప్పుకొస్తున్నారు. మరి మీకేమనిపిస్తుందో కామెంట్ల రూపంలో తెలియజేయండి.

# ట్రంప్ తన తప్పు తెలుసుకున్నాడు..

### అందుకే భారత్‌పై మాట మార్చాడు: మాజీ దౌత్యవేత్త



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడంతో పాటు తీవ్ర విమర్శలు గుప్పించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు తన వైఖరిని మార్చుకున్నారని భారత మాజీ దౌత్యవేత్త కేపీ ఫాబియన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాల విషయంలో తన పంతం నెగ్గదనే విషయం ఆయనకు అర్థమైందని అన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులపై భారత్‌ను అణగదొక్కాలని ట్రంప్ ప్రయత్నించినా అది విఫలమైందని తెలిపారు. భారత్ ఒక సంస్కృతి కలిగిన దేశమని, అగ్ర రాజ్యాల ఒత్తిళ్లకు లొంగిపోదని విషయం గ్రహించారు కాబట్టే.. భారత్‌పై ట్రంప్ స్వరం మార్చారని వివరించారు.తాజాగా ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేపీ ఫాబియన్ మాట్లాడుతూ.. ట్రంప్ ఇండియాపై సుంకాలు విధించినప్పుడు ఆయనకు ఓ విషయం స్పష్టంగా అర్థం అయిందన్నారు. ముఖ్యంగా భారత్ ఇతర దేశాల నుంచి ఆదేశాలు స్వీకరించదని, ఆంక్షలకు ఏమాత్రం లొంగదని ట్రంప్ గుర్తించారన్నారు. భారత ప్రజల శక్తి, ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకోకుండా కేవలం బెదిరింపులతో వ్యాపార సంబంధాలు కొనసాగించడం అసాధ్యమని ఫాబియన్ వివరించారు. ఈ వాణిజ్యపరమైన ఒత్తిడి కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిందని ఆయన పేర్కొన్నారు.ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో ఇతర దేశాలపై ఆంక్షలు విధించడం, అధిక సుంకాలు మోపడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. అయితే భారత్ ట్రంప్ ఒత్తిళ్లకు తలవంచకుండా తమ దేశ ప్రయోజనాలను కాపాడిందని గుర్తు చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతులపై భారత్ తన నిర్ణయాన్ని మార్చుకోకుండా దృఢంగా నిలబడిందన్నారు. ఈ పరిణామాలను గమనించిన ట్రంప్.. తన మునుపటి వాదనల నుంచి వెనక్కి తగ్గినట్లు ఫాబియన్ పేర్కొన్నారు. అంతేకాకుండా "భారత్, భారతే" అనే నినాదంతో భారత్ తన విదేశాంగ విధానాన్ని స్వతంత్రంగా నడుపుతుందని.. మరే దేశంపై ఆధార పడదని నిరూపించిందని ఆయన అన్నారు.అంతకుముందు ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. కానీ ఆ బెదిరింపులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని ఫాబియన్ గుర్తు చేశారు. దీంతో ట్రంప్ వాటిని అమలు చేశారని.. అయినా ఇండియా తలొగ్గలేదని చెప్పారు. దీంతో మాట మార్చిన ట్రంప్.. మోదీ ఓ మంచి ప్రధాని అని, ఆయనతో తన స్నేహం ఎప్పటికీ కొనసాగుతుందనిని చెప్పారని తెలిపారు. అంతేకాకుండా కోపం తగ్గిన తర్వాత భారత్-అమెరికా దేశాల మధ్య బంధాలు మళ్లీ చక్కగా కొనసాగుతాయని స్పష్టం చేశారన్నారు.అయితే ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడాలంటే అమెరికా-భారత్‌ను ఒక సమానమైన భాగస్వామిగా చూడాలని, దాని సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని ఫాబియన్ స్పష్టం చేశారు. కేవలం భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే కాకుండా స్నేహపూర్వక, గౌరవపూర్వక సంబంధాలను పెంచుకోవాలని సూచించారు.

## వాట్సాప్ సేవల్లో అంతరాయం.. సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఫిర్యాదులు



**న్యూఢిల్లీ-నవభూమి:** మెటాకు చెందిన ప్రముఖ మెసింజర్ యాప్ వాట్సాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. భారత్ లోని యూజర్లు యాప్‌ను ఉపయోగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు ఎదురైన సమస్యలపై వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ సమస్య తలెత్తింది. వాట్సాప్ సేవల్లో అంతరాయంపై దాదాపు 410కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. వాట్సాప్‌లో మెసేజ్‌లు వెళ్లడం లేదని, స్టేటస్‌లు కూడా అప్‌లోడ్ కావడం లేదని పేర్కొంటున్నారు. దీంతో వారంతా తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. దాదాపు 54 శాతం మంది యూజర్లు సర్వర్ కనెక్షన్‌లో సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. 24 శాతం మంది డెస్క్‌టాప్‌లో, 22 శాతం మొబైల్ యాప్‌లో అంతరాయాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. యూజర్ల ఫిర్యాదులతో సోషల్ మీడియాలో

## ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించండి.. ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం..!

బిహార్-నవభూమి:బిహార్ ఓటర్ల జాబితా ఇంటెన్సివ్ రివిజన్ కేసులో సుప్రీంకోర్టు ఆధార్ చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు అని స్పష్టం చేసింది. అయితే, అది పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని తేల్చి చెప్పింది. బీహార్ ఓటర్ల జాబితా ఇంటెన్సివ్ రివిజన్ కేసుపై విచారణ సందర్భంగా సోమవారం.. ఓటర్లు తమ పేరును ఓటరు జాబితాలో చేర్చేందుకు ఆధార్ కార్డును 12వ పత్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే 11 పత్రాల జాబితాను విడుదల చేసింది. గతంలో జారీ చేసిన పత్రాల జాబితాలో ఆధార్ కార్డును మాత్రం చేర్చలేదు. తాజాగా సుప్రీంకోర్టు ఆధార్ కార్డును 12వ పత్రంగా అంగీకరించాలని ఆదేశించింది. ఆధార్ కార్డును ఆమోదించేందుకు వీలుగా అధికారులకు సూచనలు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి సూచించింది. అయితే, ఆధార్ కార్డును పౌరసత్వ రుజువుగా పరిగణించలేమని సుప్రీంకోర్టు క్లారిటీ ఇచ్చింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి సుప్రీం భారీ ఉపశమనం ఇచ్చింది. ఆధార్ కార్డు చెల్లుబాటును తనిఖీ చేసేందుకు ఎన్నికల సంఘానికి పూర్తి అధికారం ఉంటుందని తెలిపింది. ఆధార్ కార్డు చూపించి ఓటర్ల జాబితాలో చేర్చాలని ఆర్జేడీ పార్టీతో పాటు పలువురు డిమాండ్ చేశారు. ఆయా పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. బూత్ లెవల్ అధికారులు ఆధార్ కార్డులను అంగీకరించడం లేదని ఆర్జేడీ తరపున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులకు సూచనలు జారీ చేయలేదని సిబల్ తెలిపారు. ఎన్నికల కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది హాజరయ్యారు. ఆధార్ కార్డును పౌరసత్వ రుజువుగా అంగీకరించలేమంటూ వాదనలు వినిపించారు.

## పరోక్ష పన్నుల ప్రత్యక్ష బాదుడు - జీఎస్టీ కొత్త సంస్కరణ

మన దేశపు పన్ను విధానంలో అమలులోకి వచ్చిన జీఎస్టీని దేశంలోనే అత్యంత విప్లవాత్మక ఆర్థిక సంస్కరణగా పేర్కొన్నారు. పన్నుల ఏకీకరణ, పారదర్శకత, సరళత అనే ముగ్గురు ప్రధాన లక్ష్యాలతో ఇది ప్రారంభమైంది. అయితే అమలులోకి వచ్చిన ఎనిమిదేళ్లకే ఈ వ్యవస్థ అనేక సమస్యలను సృష్టిస్తూ ప్రజలకు పరోక్షంగా భారీ భారం మోపుతోందన్న విమర్శలు పెరుగుతున్నాయి. ప్రధాని ఇటీవల ఆరు శ్లాబ్‌ల జీఎస్టీని రెండు శ్లాబ్‌లుగా సులభతరం చేస్తామని వాగ్దానం చేశారు. కానీ తాజాగా జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఈ వాగ్దానానికి పూర్తి విరుద్ధంగా, జీఎస్టీని ఐదు కఠినమైన శ్లాబ్‌లుగా మార్చాయి.మొదట 0 శాతం, 3 శాతం (బంగారంపై), 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం అనే ఆరు శ్లాబ్‌లు అమలులో ఉండేవి. అయితే తాజా సంస్కరణల్లో 12 శాతం శ్లాబ్ తొలగించబడింది. 28 శాతం స్థానంలో 40 శాతం శ్లాబ్ అమల్లోకి వచ్చింది. ఈ మార్పుతో జీఎస్టీ మరింత సంక్లిష్టతరం అయ్యింది. ప్రధానమంత్రి ఇచ్చిన సరళత వాగ్దానం సాకారమవ్వక, ప్రజలపై భారమే మిగిలింది.జీఎస్టీ సంస్కరణలో మదింపు ప్రక్రియలో కొన్నివస్తువులపై పన్ను తగ్గింపులు అమలులోకి వచ్చినప్పటికీ, మరెన్నో కీలక రంగాలపై పన్నులు పెరిగాయి. ముఖ్యంగా బొగ్గు రంగంపై భారీ ప్రభావం పడనుంది. ఇంతవరకు 5 శాతం జీఎస్టీ ఉన్న బొగ్గుపై ఇప్పుడు 18 శాతం విధించనున్నారు. దీనికి తోడు టన్నుకు రూ.400 లెవీ కూడా ఉంది. కేంద్రం ఈ లెవీని తొలగిస్తామని చెప్పినా, బొగ్గుపై పెరిగిన 13 శాతం అదనపు పన్ను మాత్రం అలాగే మిగిలిపోతుంది. విద్యుత్తు ఉత్పత్తికి ఇది ప్రధాన ఇంధనం కావడంతో విద్యుత్తు ధరలు పెరుగుతాయి. విద్యుత్తుపై జీఎస్టీ లేకపోవడం వల్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ కూడా లభించదు. ఫలితంగా విద్యుత్తు ఉత్పత్తి వ్యయం పెరిగి, పరిశ్రమలు, ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులపై అదనపు భారం పడుతుంది.ఇక పెట్రోలియం రంగంలో కూడా భారం పెరిగింది. ముడి చమురు, శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులను పైప్‌లైన్ ద్వారా రవాణా చేసే సేవలపై జీఎస్టీ 12 శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. చమురు అన్వేషణ, అభివృద్ధి, ఉత్పత్తి సంబంధిత సేవలపై కూడా పన్ను పెంచారు. దీని ఫలితంగా పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడం ఖాయం. ఈ ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేదు కాబట్టి, ఈ వ్యయభారం పూర్తిగా చమురు మార్కెటింగ్ కంపెనీలపై పడుతుంది. అవి తిరిగి వినియోగదారులపై మోపడం తప్పదని స్పష్టంగా తెలుస్తోంది. వినియోగదారులకు ప్రత్యక్షంగా కనబడే కొన్ని వస్తువులపై పన్ను తగ్గించినప్పటికీ, పరోక్షంగా అందరికీ ముడిపడే ఇంధన రంగంపై పన్నులు పెంచడం ద్వారా జీఎస్టీ మరింత భారం మోపింది.కొన్ని రంగాలకు మినహాయింపులు ఇచ్చినట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఉదాహరణకు వస్త్ర, ఎరువుల రంగాలపై సుంకాలను తొలగించారు. పాల ఉత్పత్తులు, పెన్సిల్ తయారీ రంగాలకు కూడా జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. కానీ వాటి ఇన్‌పుట్‌లపై మాత్రం పన్ను వసూలు చేస్తున్నారు. కలపపై సుంకం తగ్గించినా 5 శాతం పన్ను అలాగే కొనసాగుతోంది. పెన్సిల్‌పై పన్ను సున్నా చేసినా, తయారీదారులు ఇన్‌పుట్ పన్ను భారం తేలిక చేయలేరు. ఇలా ఒకచోట మినహాయింపు ఇచ్చి, మరొకచోట పన్ను విధించడం వల్ల పరిశ్రమలు గందరగోళంలో పడుతున్నాయి.లగ్జరీ, ప్రీమియం వస్తువుల మధ్య తేడాను స్పష్టంగా నిర్వచించే అవకాశం జీఎస్టీ కౌన్సిల్ వదులుకుంది. రెండింటినీ ఒకే వర్గంలో కలిపి 40 శాతం పన్ను విధించింది. లగ్జరీ వస్తువులు అంటే ధర పెరిగినా డిమాండ్ పెరిగే ప్రత్యేక ఉత్పత్తులు. కానీ ఇవి, ప్రీమియం ఉత్పత్తులను ఒకే గాటన కట్టి వినియోగదారులకు అందుబాటులో లేకుండా చేశాయి. డెలివరీ సేవలపై పన్ను 5 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. రివర్స్ చార్జ్ విధానంతో ఈ-కామర్స్ సంస్థలపై అదనపు భారం మోపారు. ఫలితంగా స్విగ్గీ, జొమాటో వంటి సంస్థలు ఎక్కువ పన్ను చెల్లించవలసి ఉంటుంది. ఇది వినియోగదారులపై మరిన్ని ఛార్జీల రూపంలో పడుతుంది.ప్రజలు విస్తృతంగా వినియోగించే కొన్ని వస్తువులపై పన్ను తగ్గించడం స్వాగతించదగినదే. కానీ అదే సమయంలో ఇంధన ఖర్చులు పెరగడం, ప్రీమియం వస్తువులను లగ్జరీ వస్తువులతో కలపడం వల్ల సాధారణ వర్గాలకు కూడా ఆ ఉత్పత్తులు అందుబాటులో ఉండవు. పరోక్ష పన్నులు మరింత పరోక్షంగా మారాయి.భారతీయుల వ్యయాలు, పొదుపులు ఒకదానికోసం మరొకదానికి మళ్లడం సహజం. ఒక వస్తువుపై ఆదా అయిన ఖర్చు మరో వస్తువుపై వెళ్తుంది. చివరికి ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలోనే ఆదాయం వస్తుంది. అందువల్ల పన్ను ఆదాయ నష్టం జరగదు. కానీ వినియోగదారులు అనవసర భారం మోస్తారు.ఈ నేపథ్యంలో నిజమైన సంస్కరణగా భావించదగిన అంశం ఏమిటంటే ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ ఈ-రూపీ ద్వారా జీఎస్టీ చెల్లింపులను తప్పనిసరి చేయడం. ఇది అన్ని చెల్లింపులను పారదర్శకంగా మార్చుతుంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మోసాలకు ముగింపు పలుకుతుంది. వస్తువుల రవాణా సమయంలో ఈ-వే బిల్లుల అవసరం తొలగిపోతుంది. ఇలా చేస్తేనే జీఎస్టీని సరళతరం చేయగలం.జీఎస్టీ సంస్కరణలు కొనసాగుతూనే ఉంటాయి. కానీ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు ఊరట ఇవ్వలేక, భారాన్ని మాత్రమే మోపాయి. తదుపరి సమావేశంలో అయినా జీఎస్టీ కౌన్సిల్ నిజమైన సంస్కరణలు చేపట్టాలని ఆశిద్దాం.

# మధ్యతరగతికి కొత్త ఊపిరి, ఆర్థిక వ్యవస్థకు కొత్త వేగం




భారతదేశ ఆర్థిక వ్యవస్థలో జూలై 1, 2017న ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ఒక చారిత్రక మైలురాయి. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన అతిపెద్ద పరోక్ష పన్ను సంస్కరణగా ఇది నిలిచింది. పలు కేంద్ర, రాష్ట్ర పన్నులను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం వల్ల పన్నుల మీద పన్ను పడటం తగ్గింది, దేశవ్యాప్తంగా ఒకే మార్కెట్ ఏర్పడింది. వ్యవస్థలో పారదర్శకత పెరిగింది. ఎనిమిదేళ్ల ఈ ప్రయాణంలో జీఎస్టీ క్రమంగా పరిణామం చెందింది. రేట్ల హేతుబద్ధీకరణ, డిజిటలైజేషన్ వంటి మార్పులతో ఇది ఇప్పుడు భారతదేశ పరోక్ష పన్ను వ్యవస్థకు వెన్నెముకగా మారింది. కానీ, పన్ను సంస్కరణల ప్రయాణం ఇక్కడితో ఆగిపోలేదు. సామాన్యుల జీవితాలను మెరుగుపరచడం, ఆర్థిక వ్యవస్థకు కొత్త వేగాన్ని అందించడం అనే లక్ష్యాలతో ఇప్పుడు నెక్స్ట్-జనరేషన్ జీఎస్టీ సంస్కరణలు మన ముందుకు వచ్చాయి.ఈ సంస్కరణల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మాట్లాడుతూ, "ప్రభుత్వం నెక్స్ట్-జనరేషన్ జీఎస్టీ సంస్కరణలను తీసుకురానుంది, ఇది సామాన్యుల పన్ను భారాన్ని తగ్గిస్తుంది. ఇది మీకు దీపావళి కానుక" అని ప్రకటించారు. ఈ మాటలు కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు, ఇది ఒక స్పష్టమైన హామీ. ఈ సంస్కరణలు మధ్యతరగతి ప్రజలకు, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), మహిళలు, యువత, మధ్యతరగతి కుటుంబాలకు నేరుగా లబ్ధి చేకూర్చడంతోపాటు, భారతదేశ ఆర్థిక వృద్ధికి ఒక బలమైన పునాది వేస్తాయి.

**సరళమైన నిర్మాణం, స్పష్టమైన ప్రయోజనాలు:**

ఈ సంస్కరణల్లో అత్యంత ముఖ్యమైన మార్పు రెండు-శ్లాబుల విధానం (5%,18%). గతంలో ఉన్న 12% మరియు 28% రేట్లను తొలగించడం వల్ల పన్ను వ్యవస్థ మరింత సరళంగా మారింది. ఇది పన్నుల మీద ఉండే గందరగోళాన్ని తగ్గించి, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చేస్తుంది. అలాగే, పాన్ మసాలా, పొగాకు, లగ్జరీ కార్ల వంటి 'చెడు' అలవాట్ల ఉత్పత్తులపై 40% పన్ను విధించడం న్యాయమైన పన్ను వ్యవస్థకు నిదర్శనం. ఇది ఒకవైపు పన్ను ఆదాయాలను సమతుల్యం చేస్తూనే, సామాన్య ప్రజల నిత్యావసరాలపై భారం పడకుండా చూస్తుంది.

ఈ సంస్కరణల ప్రయోజనాలు కేవలం రేట్ల మార్పులకే పరిమితం కాలేదు. ఇది జీవన నాణ్యతను పెంచే లక్ష్యంతో రూపొందించబడింది. నిత్యావసరాలైన సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్ట్ వంటి వాటిపై పన్ను తగ్గించడం ద్వారా ప్రజలకు నేరుగా ఆర్థిక భారం తగ్గుతుంది. అంతేకాకుండా, టీవీలు, ఏసీలు, డిష్‌వాషర్‌లపై పన్ను 28% నుంచి 18%కి తగ్గడంతో మధ్యతరగతి కుటుంబాలు ఈ వస్తువులను మరింత సరసమైన ధరలకు కొనుగోలు చేయగలుగుతాయి. ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. ఈ చర్యలు కేవలం వస్తువుల ధరలను తగ్గించడం మాత్రమే కాదు, ప్రజల కొనుగోలు శక్తిని పెంచుతాయి. ఫలితంగా, మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది, ఇది దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదం చేస్తుంది.

వివిధ రంగాలపై జీఎస్టీ సంస్కరణల ప్రభావం:

ఈ సంస్కరణల ప్రభావం కేవలం కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం కాదు, ఇది భారత ఆర్థిక వ్యవస్థలోని ప్రతి ముఖ్యమైన రంగంలోనూ కనిపిస్తుంది. గృహ నిర్మాణంలో సిమెంట్, మార్బుల్, గ్రానైట్, ఇసుకతో చేసిన ఇటుకలపై పన్ను తగ్గించడంతో ఇళ్ల నిర్మాణం చౌకగా మారింది. ఇది రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమివ్వడమే కాకుండా, నిర్మాణ రంగంలో కొత్త ఉద్యోగాలను కూడా సృష్టిస్తుంది. వ్యవసాయ రంగానికి అవసరమైన ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, బయో-పురుగుమందులపై పన్ను తగ్గించడం వల్ల రైతుల ఖర్చులు తగ్గుతాయి. అలాగే, తప్పుడు డ్యూటీ నిర్మాణాన్ని సరిదిద్దడం వల్ల దేశీయ ఎరువుల ఉత్పత్తి పెరుగుతుంది. ఆటోమొబైల్ రంగానికి చెందిన చిన్న కార్లు, టూ-వీలర్లు, బస్సులు, ట్రక్కులు, అన్ని ఆటో పార్టులపై పన్ను 28% నుంచి 18%కి తగ్గింది. ఇది దేశీయ తయారీని ప్రోత్సహించి, వాహనాల ధరలను తగ్గిస్తుంది. సేవా రంగంలోకి వచ్చే హోటల్ బస, జిమ్‌లు, సెలూన్‌లు, యోగా సేవలకు పన్ను 18% నుంచి 5%కి తగ్గించారు. దీనివల్ల సామాన్య ప్రజలకు ఈ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. విద్య, వైద్యానికి సంబంధించి ఎక్సర్సైజ్ పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్‌లపై పన్ను సున్నా శాతం. అలాగే, 33 రకాల ప్రాణరక్షక మందులు, డయాగ్నోస్టిక్ కిట్‌లపై పన్ను సున్నా శాతానికి తగ్గించడంతో ఆరోగ్యం, విద్య ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చాయి. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ మినహాయింపు కూడా ఆర్థిక భద్రతకు ఒక గొప్ప సహాయం.

**ఆశతో కూడిన భవిష్యత్తు:**

ఈ సంస్కరణలన్నీ సెప్టెంబర్ 22, 2025 నుండి అమలులోకి రావడం దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. జీఎస్టీని మరింత సరళమైన, న్యాయమైన, వృద్ధి ఆధారిత వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం తీసుకున్న కఠినమైన చర్యలను ఇవి ప్రతిబింబిస్తాయి. ఈ నిర్ణయాలు దేశ ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఆర్థిక వృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఒక పటిష్టమైన పునాదిని వేస్తాయి. నా అభిప్రాయం ప్రకారం, ఇది భారతదేశ ఆర్థిక ప్రగతికి ఒక కొత్త అధ్యాయం, దీనివల్ల దేశం మరింత బలోపేతం అవుతుందని, ప్రతి పౌరుడికి ప్రయోజనం చేకూరుతుందని కోరుకుందాం

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# తెలంగాణ స్ఫూర్తి గీతం కాళోజీ గళం



తెలంగాణ సాహిత్య, రాజకీయ, సామాజిక చరిత్రలో ఒక శాశ్వత ప్రతిధ్వని కాళోజీ నారాయణరావు. ఆయనను "ప్రజాకవి" అని పిలవడం యాదృచ్ఛికం కాదు. ఆయన రాసిన ప్రతి పదం ప్రజల గుండెలోంచి పుట్టి ప్రజల కోసం పోరాడింది. వివక్ష ఎక్కడ కనిపించినా వ్యతిరేకించాడు, మంచిని స్వాగతించాడు. అణచివేత, అన్యాయం ఎక్కడ చోటు చేసుకున్నా దానికి ఎదురు నిలిచాడు. అందుకే ఆయనను ఉద్యమజీవి, తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి అని పిలుస్తారు.

**బాల్యం- విద్య**

కాళోజీ 1914 సెప్టెంబర్ 9న బీజాపూర్ జిల్లాలోని రట్టహళ్ళి గ్రామంలో జన్మించారు. సిరిసంపదలేమి లేని మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నతనమే కష్టనష్టాలు చూసింది. కుటుంబం కొన్నేళ్ళు మహారాష్ట్రలోని సాయిరాం గ్రామంలోనూ, కొంతకాలం తెలంగాణలోని ఇలెందు తాలూకా కారేపల్లిలోనూ గడిపింది. తర్వాత హనుమకొండ, మడికొండ ప్రాంతాల్లో జీవనం సాగింది. ఆయన అన్న రామేశ్వరరావు న్యాయవిద్య కోసం హైదరాబాద్ వెళ్ళడం వల్ల, కాళోజీ కూడా విద్య కోసం అక్కడికి వెళ్లారు. పాతబస్తీ చౌమహల్లా కాన్గీబడీల్లో, సుల్తాన్‌బజార్ రెసిడెన్సీ మిడిల్ స్కూల్లో చదివారు. తరువాత వరంగల్ కాలేజియేట్ హైస్కూల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేసి, 1939లో "లా" విద్య పూర్తి చేశారు.

**ఉద్యమ జీవితం**

విద్యార్థి దశ నుంచే కాళోజీ అన్యాయాన్ని ప్రశ్నించే స్వభావం పెంచుకున్నారు. ఆయన జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించి జైలుజీవితాన్ని అనుభవించారు. నిజాం పాలనలో ఆయన ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన తన గొంతు వినిపించారు. సమాజంలో ఏదైనా అన్యాయం జరిగినా, అది తనకోసమో, కుటుంబానికోసం కాదుబీ ప్రజల కోసం ఆయన ఎప్పుడూ ముందుండేవారు. కాళోజీ తత్వం స్పష్టంగా చెప్పేది – "ఇతరుల బాగు కోసం పోరాడడం నిజమైన జీవితం."

**కవిత్వం – ప్రజల గొంతు**

కాళోజీ కవిత్వం సాహిత్యం కాదు, అది ప్రజల స్వరం. ఆయన కవితలు చదివితే తెలంగాణ ప్రజల గుండెల్లో దాగి ఉన్న ఆవేదన వినిపిస్తుంది. ఆయన రాసిన "నా గొడవ" అనే సంపుటం ఎనిమిది భాగాలుగా వెలువడింది. ఇందులో సమాజంలోని చిన్నా పెద్దా సమస్యలను ఆయన తన గొడవగా మలచుకున్నారు. దాశరథి ఆయనను "తెలంగాణ ఆధునిక సాహిత్య ముఖద్వారం" అని అభివర్ణించారు.

భాషపై ఆయన అభిప్రాయాలు లోతైనవి. ఆయన దృష్టిలో రెండు రకాల భాషలున్నాయి – "బడి పలుకుల భాష" (గ్రాంధికం), "పలుకుబడుల భాష" (ప్రజల నిత్యజీవన భాష). ఆయన ఎప్పుడూ ప్రజల భాషకే దగ్గరగా నిలబడ్డారు. మాండలికం ఏ భాషకైనా జీవదాతువని ఆయన నమ్మారు. అందుకే ఆయన కవిత్వం మేధావులకు మాత్రమే కాకుండా, సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా ఉండేది.

"ప్రాంతేతరులు దోపిడి చేస్తే పొలిమేర దాకా తరుముతాం, ప్రాంతం వాడే దోపిడి చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తాం" అనే ఆయన పదాలు తెలంగాణ మనస్తత్వానికి అద్దం పట్టాయి. ఇది కేవలం కవిత్వం కాదు, అది ప్రజల రక్తంలో ఉట్టిపడే నిజం.

**కథలు – నిష్కళంక స్వరం**

కాళోజీ కవిత్వమే కాకుండా కథకుడిగానూ రాణించారు. ఆయన కథల్లో స్వచ్ఛత, సూటిదనం, నిజాయితీ స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన మాటల్లో ఎటువంటి ఆర్భాటం ఉండేది కాదు. నచ్చని విషయంపై ఆయన స్పష్టంగా తిరుగుబాటు చేసే ధైర్యం చూపించారు. అందుకే ఆయన కథలు సాహిత్యప్రియులకే కాదు, సామాన్యులకు కూడా చేరువయ్యాయి.

**ప్రజాస్వామ్యం-ఓటు విలువ**

కాళోజీ ప్రజాస్వామ్యంపై గొప్ప విశ్వాసం కలిగి ఉన్నారు. ఆయన దృష్టిలో ఓటు హక్కు పవిత్రమైనది. ప్రజలకు ఓటు విలువను తెలియజేయడానికి మెడలో "ఓటు హక్కు పవిత్రం" అనే బోర్డు వేసుకొని తిరిగిన సంఘటన ఆయన ప్రజాస్వామ్యంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనం. "ప్రజాస్వామ్యంలో ఓటు అంటే కేవలం హక్కు కాదు, అది సమాజాన్ని మార్చే శక్తి" అని ఆయన నమ్మకం.

**కాళోజీ జీవన తత్త్వం**

వ్యక్తిత్వం, స్వేచ్ఛ అనే రెండు ప్రధాన అంశాలను కాళోజీ ఎప్పుడూ రక్షించుకోవాలని అన్నారు. ఆయన కవిత్వంలో స్వేచ్ఛ కోసం అరిచే గళం ఉంది. నిజాం రాజును ఎదిరించి ఆయన రాసిన కవితలు, నిరంకుశ పాలనపై ఆయన గళమెత్తిన పదాలు నేటికీ ప్రాసంగికత కోల్పోలేదు. ఆయన పోరాటం కేవలం గతానికే కాదు, భవిష్యత్తుకీ స్ఫూర్తి.

**తెలంగాణ సాంస్కృతిక ప్రతిబింబం**

కాళోజీ జీవితం, కవిత్వం తెలంగాణ సంస్కృతి, భాష, మానసికతకు ప్రతిబింబం. మాటల్లో, ఆలోచనల్లో, ప్రవర్తనలో ఆయన తెలంగాణ స్వరూపం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన కవిత్వం భాషకు కొత్త పుంతలు తొక్కింది. తెలంగాణ మాండలికాన్ని కవిత్వంలోకి తెచ్చి, దానిని సాహిత్యంలో స్థిరపరిచాడు.


**కాళోజీ వారసత్వం**

కాళోజీ రాసిన ప్రతి పదం నేటికీ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి ఇస్తుంది. ఆయన జీవితం ఒక పాఠశాల. సమాజంలోని అన్యాయాన్ని ఎదిరించడం, ప్రజల కోసం పోరాడడం, భాషను ప్రజలకు దగ్గరగా ఉంచడం – ఇవన్నీ ఆయన చూపించిన మార్గాలు. ఆయన కవిత్వం, ఆయన ఆలోచనలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శనం.

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9న కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు లభించిన అతి పెద్ద గౌరవం. ఇది తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతికి ఆయన చేసిన సేవలకు గుర్తింపు.

**కాళోజీ గురించి చెప్పాలంటే**

❖ ఆయన కవిత్వం ప్రజల గొంతు.



❖ఆయన ఆలోచనలు తెలంగాణ మనస్తత్వానికి ప్రతిబింబం.

❖ఆయన జీవితం స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యానికి నిదర్శనం.


❖ఆయన పోరాటం సమాజానికి మార్గదర్శనం.


కాళోజీ కేవలం కవి కాదు, ఒక ఉద్యమం, ఒక స్ఫూర్తి. అందుకే ఆయన పేరు తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయింది.

**దేవులపల్లి రమేశ్**
సిద్దిపేట, నంగునూర్
9963701294

# దేవునికైనా అసాధ్యమే

భక్తి






వర్ధమాన మహావీరుడు అహింసా మూర్తి. ఆయన ప్రభావం పశుపక్షాదుల మీద కూడా ఉండేది. ఆయన వెళ్ళిన ప్రాంతంలో పరిసరాల్లో ప్రశాంతత ఏర్పడేది. నదుల్లో నీరు తాగడానికి వచ్చిన పులులు, సింహాలు, గోవులు, జింకలు పక్కపక్కనే సంచరించేవి. మహావీరుడి సామీప్యం క్రూర జంతువులను సైతం సాధుజంతువులుగా మార్చేది . జంతువులు, జనులు అక్కడ నిర్భయంగా సంచరించగలిగేవారు.

విచిత్రం ఏమిటంటే... ఎంతటి మహనీయులైనా ఎన్నో ఏళ్ళుగా తమ చుట్టూ ఉన్న కొందరిలో ఏర్పడిన అసూయా ద్వేషాలను, కామ క్రోధాలను రూపు మాపలేరు. వారిలో ఆశలను, కోరికలను నిర్మూలించలేరు. మహావీరుడి చరిత్రలోనూ ఇలాంటి ఉదంతం కనిపిస్తుంది. ఆయనకు జమాలి అనే అల్లుడు ఉండేవాడు. జమాలి ఆయన శిష్యుడు కూడా. మహావీరుడి వారసుడయ్యే హక్కు తనకే ఉందని జమాలి భావించేవాడు. మహావీరుడికి ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో రాజులు కూడా ఉన్నారు. కాబట్టి మహావీరుడి ఆధ్యాత్మిక సామ్రాజ్యం ఎంతో విశాలమైనది. మహావీరుడి తరువాత ఆయన శిష్యులందరికీ తనే నాయకుడు కావాలనే కాంక్ష జమాలిలో ఉండేది. మహావీరుడి అంతిమ దినాల్లో చాలాసార్లు తనను తదుపరి తీర్థంకరుడిగా, వారసుడిగా ప్రకటించాలని ఆయనను ఒత్తిడి చేశాడు. కానీ మహావీరుడు అందుకు సమ్మతించలేదు. "అది వీలు కాదు. ప్రస్తుత సృష్టిలో నేనే చివరి తీర్థంకరుణ్ణి. రాబోయే సృష్టిలో తీర్థంకరుడు అయ్యే యోగ్యత, అర్హత (మహావీరుడి ముఖ్య శిష్యుడు) గౌతమ గణధరుడికి ఉంది. కాబట్టి నువ్వు నా అల్లుడివి, శిష్యుడివి అయినా నిన్ను నేను నా వారసుడిగా ప్రకటించలేను" అని మహావీరుడు నిష్కర్షగా చెప్పాడు. జమాలి దీన్ని అవమానంగా భావించాడు. మహావీరుడి శిష్యుల్లో చీలికలు తెచ్చాడు. అయిదువందలమంది శిష్యులతో బయటకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత మహావీరుణ్ణి నిందలపాలు చేశాడు.

క్రూర జంతువులను, ఎందరో వ్యక్తులను మార్చగలిగిన మహావీరుడు తన అల్లుణ్ణి, శిష్యుణ్ణి ఎందుకు మార్చలేకపోయాడు? ఎందుకంటే మనం పరివర్తన చెందడానికి సిద్ధంగా లేకపోతే... ఏ మహనీయుడూ మనల్ని ఉద్ధరించడు. అది దేవుడికి కూడా సాధ్యం కాదు. అందుకే "నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి" అంటాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణ పరమాత్మ.



## లాలూను కలిసిన ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి.. బీజేపీ విమర్శ



**న్యూఢిల్లీ-నవభూమి:** బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌ను ప్రతిపక్ష ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి కలిశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన పార్టీ ఎంపీల మద్దతు కోరారు. లాలూ ప్రసాద్ యాదవ్ ఈ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డిపై బీజేపీ మండిపడింది. ఆయన కపటత్వానికి నిదర్శనమని బీజేపీ సీనియర్ నేత, మాజీ న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. 'సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి (జస్టిస్) సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి పదవికి పోటీపడుతున్న ప్రతిపక్ష అభ్యర్థి. 'దేశం ఆత్మను కాపాడటానికి నాకు ఓటు వేయండి' అని ఆయన ప్రకటించారు. ఆ తర్వాత దాణా కుంభకోణంలో దోషిగా తేలిన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను కలిశారు. 'మీరు ఎలాంటి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి. ఒక స్కామ్‌లో దోషిగా తేలిన వ్యక్తిని మీరు కలుస్తున్నారా? ఇది కపటత్వం. దయచేసి 'దేశం ఆత్మ' గురించి మాట్లాడకండి' అని అన్నారు.కాగా, ప్రతిపక్ష ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి కలిసిన లాలు ప్రసాద్ యాదవ్ పార్లమెంటు సభ్యుడు కాదని, ఉప రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో ఆయనకు ఓటు కూడా లేదని మరో బీజేపీ నేత అమిత్ మాలవీయ తెలిపారు. 'ఇది కేవలం భయంకరమైన దృశ్యం కాదు. ఉన్నత రాజ్యాంగ పదవిని ఆశించే వ్యక్తి ప్రజా జీవితంలో నిజాయితీపై చేసిన దిగ్భ్రాంతికరమైన ప్రకటన. వారి కపటత్వం బయటపడింది' అని ఎక్స్‌లో విమర్శించారు.

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
మంగళవారం
09 । సెప్టెంబర్ । 2025

## భారత పర్యటనకు ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి.. బలపడనున్న ద్వైపాక్షిక బంధం




**ఇజ్రాయెల్ -నవభూమి:** ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత పర్యటనకు రానున్నారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు బెజలెల్ స్మోట్రిచ్ భారత్‌లో పర్యటిస్తారని భారత విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. రెండు దేశాల మధ్య కొంత కాలం నుంచి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలనే విషయంలో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నాయి.ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి భారత పర్యటన సందర్భంగా భారత్-ఇజ్రాయెల్ 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడనున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. పర్యటనలో భాగంగా స్మోట్రిచ్ గాంధీనగర్‌లోని భారతదేశ ప్రపంచ ఆర్థికసేవల కేంద్రాన్ని సైతం సందర్శించనున్నారు.బెజలెల్ స్మోట్రిచ్.. భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌లతో భేటీ కానున్నట్లు అధికారులు చెప్పారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం, బలమైన, స్థితిస్థాపక పెట్టుబడి వాతావరణాన్ని సృష్టించడం, ప్రపంచ పరిస్థితులు వంటి విషయాలపై ఇరువర్గాల మధ్య చర్చలు జరిగే అవకాశం ఉంది.పర్యటన సందర్భంగా బెజలెల్ ఢిల్లీతోపాటు ముంబై, ఇతర ప్రాంతాలను సందర్శించనున్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం ఇజ్రాయెల్ మంత్రులు భారత్‌కు రావడం ఇది నాలుగోసారి. ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి హైమ్ కాట్జ్, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, వ్యవసాయం, ఆహార భద్రతా మంత్రి అవి డిచ్టర్ ఈ ఏడాది ప్రారంభంలో భారత్‌ను సందర్శించారు.

## బంగ్లాదేశ్ జాతీయులతో సహా.. 14 మంది నకిలీ బాబాలు అరెస్ట్



**డెహ్రాడూన్-నవభూమి:** ప్రజలను మోసం చేయడం, మత మార్పిడికి పాల్పడం వంటి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులు, నకిలీ బాబాలను గుర్తించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం 'ఆపరేషన్ కాలనేమి' చేపట్టింది. దీని కింద ఇప్పటి వరకు 14 మంది నకిలీ బాబాలను అరెస్ట్ చేసింది. వీరిలో కొందరు బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్ కింద రాష్ట్రంలో 5,500 మందికి పైగా వ్యక్తులను పోలీసులు ప్రశ్నించారని, వీరిలో 1,182 మందిపై చర్యలు తీసుకున్నారని చెప్పారు.కాగా, ఈ ఏడాది జూలైలో 'ఆపరేషన్ కాలనేమి'ని ఉత్తరాఖండ్ పోలీసులు ప్రారంభించారు. ఈ ఆపరేషన్ అద్భుతమైన విజయాన్ని సాధించిందని ఐజీపీ భరానే తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రశ్నించినట్లు చెప్పారు. ఆగస్ట్‌లో 4,000 మందిని పోలీసులు ప్రశ్నించిన తర్వాత 300 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు.మరోవైపు హరిద్వార్‌లో 2,704 మందిని తనిఖీ చేసిన తర్వాత ముగ్గురిని, డెహ్రాడూన్‌లో 922 మందిని తనిఖీ చేసిన తర్వాత ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఐజీపీ భరానే తెలిపారు. టెహ్రీ, పౌరి, అల్మోరా, నైనిటాల్‌తోపాటు ఇతర జిల్లాల్లో కూడా 'ఆపరేషన్ కాలనేమి' కింద పోలీసులు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 'దేవభూమి పవిత్రత'ను కాపాడటమే ఈ ఆపరేషన్ లక్ష్యమని అన్నారు.కాగా, బంగ్లాదేశ్ పౌరుడైన అమిత్ కుమార్ బెంగాలీ వైద్యుడిగా చెలామణి అవుతున్నాడని, గత ఎనిమిది ఏళ్లుగా నకిలీ పత్రాలతో సెలాకీలో నివసిస్తున్నాడని ఐజీపీ భరానే తెలిపారు. అతడి ఆధారాలు పరిశీలించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అలాగే జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన ఇఫ్రాజ్ అహ్మద్ లోలు తన మతాన్ని దాచాడని వివరించారు. ఢిల్లీకి చెందిన రాజ్ అహుజా అనే ధనవంతుడిగా నటిస్తూ మహిళలతో సంబంధాలు పెట్టుకున్నాడని, అతడ్ని కూడా సెలాకీలో అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

## ట్రంప్ తీరుతో కలిగిన బాధను, అవమానాన్ని మర్చిపోలేం : శశిథరూర్



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ తో సంబంధాలపై సానుకూలంగా మాట్లాడటం, ప్రధాని నరేంద్రమోదీ వెంటనే స్పందించడంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కామెంట్స్ చేశారు. ప్రధాని మోదీ త్వరగానే స్పందించినప్పటికీ రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు చేయాల్సిన తీవ్రమైన మరమ్మతులు మిగిలే ఉన్నాయని అన్నారు.భారత్ విషయంలో ట్రంప్ తన స్వరాన్ని తగ్గించడాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నామని థరూర్ చెప్పారు. భారతీయులు ఎదుర్కొన్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే ట్రంప్ వల్ల కలిగిన బాధను, అవమానాన్ని త్వరగా మర్చిపోలేమని అన్నారు. అధ్యక్షుడు, ఆయన సిబ్బంది చేసిన అవమానాలు చాలా ఉన్నాయని తెలిపారు. ట్రంప్ పాదరస స్వభావం కలిగిన వ్యక్తని థరూర్ అభివర్ణించారు.'ప్రధాని నరేంద్రమోదీ చాలా త్వరగా స్పందించారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం అనే ప్రాథమిక సంబంధం గురించి విదేశాంగ మంత్రి కూడా నొక్కి చెప్పారు. అది ఇప్పటికీ అలాగే ఉంది. అదే మనం ఇవ్వాల్సిన ముఖ్యమైన సందేశం. రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు కలిసి పరిష్కరించుకోవాల్సిన తీవ్రమైన అంశాలు కొన్ని ఉన్నాయని నేను భావిస్తున్నాను. ట్రంప్ కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నా. భారతీయులు ఎదుర్కొన్న వాస్తవ పరిణామాలు చాలా ఉన్నాయి. కాబట్టి అంత త్వరగా క్షమించలేరు. ఆ పరిణామాలను అధిగమించాల్సి ఉంది' అని థరూర్ మాట్లాడారు.

# ఒకే గ్రామంలో 50 మంది సివిల్ సర్వెంట్లు



**లక్నో-నవభూమి:** ప్రయత్నించాలే గానీ సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదనేది పెద్దల మాట. ఈ ప్రయత్నానికి.. మనిషి దేహం, ప్రాణం, నెత్తురు, సత్తువ.. సైన్యమని అంటారు సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి. సాధించాలనే పట్టుదల ఉంటే ఆశ, శ్వాస.. అస్త్రశస్త్రాలై విజయం తెచ్చిపెడతాయంటారు. మనిషి ఆత్మ స్థైర్యానికి.. కాస్త ప్రేరణ తోడైతే ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించొచ్చు. దీనికి నిదర్శనం ఓ గ్రామం. ఈ మారుమూల పల్లె.. 50 మంది ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్లకు పుట్టినిల్లు. ఒక్కరితో మొదలైన ప్రస్థానం పదుల సంఖ్యలో సివిల్స్ వైపు మళ్లేలా చేసింది. ఒకరి నుంచి పొందిన ప్రేరణ.. చైన్ రియాక్షన్‌లా మారింది. ఐఏఎస్, ఐపీఎస్‌లే కాకుండా ఇస్రో, బార్క్, వరల్డ్ బ్యాంక్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో పనిచేస్తున్నారు ఈ గ్రామానికి చెందిన వ్యక్తులు. అందుకే ఈ పల్లెను 'ఇండియా ఐఏఎస్ ఫ్యాక్టరీ' అని పిలుస్తున్నారు. వీరంతా ఎలాంటి కోచింగ్ లేకుండానే యూపీఎస్సీ పరీక్షలు క్లియర్ చేయడం విశేషం. ఈ గ్రామం ఎక్కడుంది? కోచింగ్ లేకుండా సివిల్స్ క్రాక్ చేయడం ఎలా సాధ్యమైంది? అనే ఆసక్తికర విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.ఉత్తర్‌ప్రదేశ్‌లోని జాన్‌పూర్ జిల్లాలో మధోపట్టి అనే గ్రామం ఉంది. ఈ మారుమూల గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. సరిగా కరెంటు కూడా ఉండదు. రెండు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అంతకుమించి కోచింగ్ సెంటర్లు, లైబ్రరీలు, పాష్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు కూడా లేవు. అయినా ఈ గ్రామం.. వంటి 50 మంది సివిల్ సర్వెంట్లను దేశానికి అందించింది. మధోపట్టిలో ఒకే కుటుంబంలో నలుగురు యూపీఎస్సీ క్లియర్ చేయడం విశేషం. అందుకే ఈ గ్రామానికి ఇండియా ఐఏఎస్ ఫ్యాక్టరీ అని పేరు వచ్చింది.1914లో మహ్మద్ ముస్తాఫా హుస్సేన్ అనే వ్యక్తి బ్రిటీష్ పాలనలో సివిల్ సర్వీసెస్ క్లియర్ చేశారు. మధోపట్టి నుంచి సివిల్ సర్వెంట్ అయిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచారు. ముస్తాఫా సాధించిన విజయం గురించి ఊరంతా కథలు కథలుగా మాట్లాడుకున్నారు. అలా ముస్తాఫా ఇచ్చిన ప్రేరణ చైన్ రియాక్షన్‌లా ఊరంతా వ్యాపించింది. 1950లో డాక్టర్ ఇందూ ప్రకాశ్ సింగ్ ఐఎఫ్ఎస్ అధికారి అయ్యారు. ఆ తర్వాత 1955లో వినయ్ కుమార్ సింగ్ సివిల్స్ క్రాక్ చేశారు. అనంతరం వినయ్ కుమార్ ఇద్దరు సోదరులు ఛత్రపాల్ సింగ్, అజయ్ కుమార్ సింగ్ 1964లో, మరో సోదరుడు శశికాంత్ సింగ్ 1968లో సివిల్స్ క్లియర్ చేశారు. మధోపట్టి ప్రస్థానం ఇక్కడితో ఆగలేదు. వీరు ఇచ్చిన ఇన్స్పిరేషన్‌తో యువత యూపీఎస్సీ వైపు మళ్లారు.

కోచింగ్ లేకుండా ఎలా సాధ్యమైంది?

ఢిల్లీ, బెంగళూరులో ఉన్నట్లు మధోపట్టిలో కోచింగ్ సెంటర్లు లేవు. లైబ్రరీలు లేవు, వీరంతా ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదువుకోలేదు. కేవలం సీనియర్లు ఇచ్చిన మెంటరింగ్ వల్లే ఇది సాధ్యమైంది. ఐపీఎస్, ఐఏఎస్ అయిన వాళ్లు జూనియర్లకు బుక్స్, నోట్స్ ఇచ్చేవారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో చెప్పేవారు. ఇక్కడి యూపీఎస్సీ ఆశావహులు ఇంటర్మీడియేట్ నుంచే ప్రపరేషన్ మొదలు పెట్టేవాళ్లు.. స్థానిక హిందీ మీడియం పాఠశాలల్లో చదువుకున్నా కష్టపడి ఇంగ్లీష్ నేర్చుకునేవారు.

యూపీఎస్సీకి సన్నద్ధమవుతున్న క్రమంలో కుటుంబాల మద్దతు కూడా కీలకంగా మారుతుంది. ఒక ప్రయత్నంలో విఫలం అయితే.. మరో అటెంప్ట్ చేసేందుకు నైతిక బలాన్ని అందిస్తుంది. ఇక్కడి కుటుంబాల్లో పిల్లలు కలసి చదువుకుంటారు. ప్రతి విజయాన్ని ఊరంతా పండగలా జరుపుకుంటుంది. రోడ్డు సరిగా లేకపోవడం, బస్సులు అప్పుడప్పుడు వస్తూ.. కనెక్టివిటీ సరిగా లేకున్నా.. ఆధునిక సౌకర్యాలు లేకపోయినా.. అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తుండటంతో.. ఈ గ్రామ యువత విజయం మరింత గొప్పగా కనిపిస్తోంది.ఐఏఎస్, ఐపీఎస్‌లే కాదు.. ఇస్రో, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ , వరల్డ్ బ్యాంకులో ఈ గ్రామ యువత ఉన్నత స్థానాల్లో ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. మధోపట్టిలో 208 కుటుంబాలు ఉంటే.. 1174 మంది జనాభా ఉన్నారు. ఇందులో 50 మంది సివిల్ సర్వెంట్లతో ఈ గ్రామం ఆఫీసర్- పాపులేషన్ రేషియో చాలా ఎక్కువగా ఉంది. భారత్‌లోని చాలా జిల్లాల రేషియో కూడా ఇంత లేకపోవడం గమనార్హం. ఇంతమంది అధికారులు ఉన్నా మధోపట్టి ఇప్పటికీ అదే అవస్థలు పడటం గ్రామస్థులను ఆవేదనకు గురి చేస్తోంది.

కోచింగ్ సెంటర్లలో కథగా చెబుతారు.. వీళ్ల విజయం మధోపట్టి వాసులు సాధించిన విజయాలను సివిల్స్ కోచింగ్ సెంటర్లలో కథగా చెబుతారు.. యూపీఎస్సీ ఆశావహుల్లో ప్రేరణ నూరి పోస్తారు. ఇప్పటికీ మధోపట్టి యువత అదే గుంతల రోడ్లలో తిరుగుతూ, ఎప్పుడు ఆగిపోతుందో తెలియని బల్బుల కింద యూపీఎస్సీకి సిద్ధం అవుతుండటం గురించి చెబుతారు. కనీస సౌకర్యాలు, కోచింగ్ లేకుండా.. తప్పించుకోవడానికి కారణాలను వెతుక్కోకుండా.. సీనియర్లు ఇచ్చిన ప్రేరణతో ముందుకు సాగుతున్న వారిని ఆదర్శంగా చూపిస్తారు.

దేశంలోనే అత్యంత క్లిష్టమైన పరీక్షల్లో యూపీఎస్సీ ఒకటి. ఏటా లక్షల మంది పరీక్షలు రాసినా.. కొందరే సివిల్ సర్వీసులకు ఎంపిక అవుతారు. లక్షల మంది ఉన్న జిల్లాల్లో కూడా మధోపట్టిలో ఉన్నట్లు.. సివిల్ సర్వెంట్లు ఉండరు. తేడా ఒక్కటే.. సౌకర్యాలు మన తలరాతను నిర్ణయించవు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకుసాగే మైండ్‌సెట్, ఫోకస్ ఉంటే.. విజయం దాసోహం అవుతుంది. దానికి మధోపట్టి సాధించిన విజయమే నిదర్శనం.

## సోషల్ మీడియా బ్యాన్‌పై నేపాల్‌లో ఆందోళనలు



**ఖట్మాండు-నవభూమి:** సోషల్ మీడియా బ్యాన్‌పై నేపాల్‌లో ఆందోళనలు.. ఎనిమిది మంది మృతి.. 100 మందికిపైగా గాయాలు హిమాలయ దేశం నేపాల్‌లో ఘర్షణ వాతావరణం నెలకొంది. సోషల్ మీడియాపై విధించిన నిషేధం హింసకు దారి తీసింది.

హిమాలయ దేశం నేపాల్ లో ఘర్షణ వాతావరణం నెలకొంది. సోషల్ మీడియాపై విధించిన నిషేధం హింసకు దారి తీసింది. నేపాల్ ప్రభుత్వం ఇటీవలే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్, స్నాప్‌చాట్ తదితర 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు.ఖాట్మండూలోని నేపాల్ పార్లమెంట్ వైపుకు నిరసనకారులు దూసుకెళ్లారు. అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో భద్రతా దళాలు రబ్బర్ బుల్లెట్స్‌తో కాల్పులు జరిపారు. అంతేకాదు, టియర్ గ్యాస్, వాటర్ కెనాన్స్ ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 100 మందికిపైగా గాయపడ్డారు.

పరిస్థితిని ముందే అంచనా వేసిన అధికారులు సోమవారం న్యూ బనేశ్వర్, చుట్టుపక్కల ప్రాంతాలలో కర్ఫ్యూ విధించారు. నిరసనలో పాల్గొన్న వేలాది మంది యువకులు వీధుల్లోకి రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులు నిషేధిత ప్రాంతంలోకి చొరబడటంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో సైన్యం రంగంలోకి దిగాల్సి వచ్చింది. మరోవైపు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12:30 నుండి రాత్రి 10 గంటల వరకు నగరంలో కర్ఫ్యూ విధిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## నీది 4 ఎకరాలే, నాది 40 ఎకరాలు..

### కష్టం చెప్పుకునేందుకు వచ్చిన రైతుతో ఖర్గే



**:న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ రాజకీయాల్లో ఎప్పుడూ చురుగ్గా ఉండే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. తన సొంత జిల్లా కలబురిగిలో ఒక రైతుతో వ్యవహరించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. పంట నష్టం గురించి ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఒక రైతుపై ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేయడం, ఆ రైతును నిర్లక్ష్యంగా తిరిగి పంపించేయడం ప్రస్తుతం ప్రజల ఆగ్రహానికి కారణం అవుతోంది. ముఖ్యంగా వర్షాలు ఎక్కువై పంట నష్టపోయానని ఆవేదనతో వచ్చిన రైతుకు.. ఖర్గే ఇచ్చిన సమాధానం రాజకీయ వర్గాల్లోనూ, సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. మరి ఖర్గే అంతలా ఏం కామెంట్లు చేశారంటే..?ఈ ఘటన కలబురిగిలో జరిగింది. తమ కళ్ల ముందే పంటలు నాశనం అయిపోతున్నాయని, వర్షాలు ఎక్కువై పంటంతా వర్షార్పణం అయిందని చెప్పడానికి ఆ రైతు నేరుగా ఖర్గే వద్దకు వచ్చాడు. రైతు కష్టాన్ని విన్న తర్వాత ఖర్గే ఆప్యాయంగా స్పందించడానికి బదులుగా.. "నేనేం చేయాలి? వెళ్లి మోదీని అడగండి" అని మండిపడ్డారు. అక్కడితో ఆగకుండా నీది నాలుగు ఎకరాలు మాత్రమే పొడైంది. నాదైతే 40 ఎకరాలు నాశనం అయిందంటూ చెప్పుకొచ్చాడు. మరి నేనేం చేయాలంటూ రైతును ప్రశ్నించారు. ఖర్గే చేసిన ఈ వ్యాఖ్యలకు ఆ రైతు ఆశ్చర్యపోయి.. "మీరు మా నాయకుడు కాబట్టే మీ వద్దకు వచ్చాను" అని బదులిచ్చాడు.కానీ ఖర్గే ఆ రైతు మాటలను పట్టించుకోకుండా.. "ఇది కేవలం పబ్లిసిటీ స్టంట్" అంటూ అభివర్ణించారు. ఇలాంటి పనులు మరోసారి చేయొద్దంటూ రైతును అక్కడి నుంచి పంపించివేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. ప్రజలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతు సమస్యలు, పంట నష్టాలు, అన్నదాతలకు జీవన్మరణ సమస్యగా మారిన ప్రస్తుత తరుణంలో.. ఒక సీనియర్ నాయకుడి నుంచి ఇలాంటి స్పందన రావడం సమాజంలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. వ్యవసాయ సంక్షోభంపై పదేపదే మాట్లాడే నాయకులు, క్షేత్ర స్థాయిలో రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఇది రుజువు చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఖర్గే ఒక సీనియర్ పార్లమెంటేరియన్‌గా, దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిగా ఖర్గే అందరికీ సుపరిచితులు. ఆయన తన ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి, అండగా నిలుస్తారని కలబురిగి ప్రజలు విశ్వసించారు. కానీ ఈ ఘటన ఆ నమ్మకాన్ని దెబ్బతీసిందనే భావన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా ఈ సంఘటన రైతులకు నేరుగా అండగా నిలవాల్సిన నాయకులు, వారి సమస్యలను రాజకీయంగా చూస్తున్నారని.. ఇది దేశవ్యాప్తంగా అన్నదాతల ఆవేదనను మరింత పెంచుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రియుడితో కలిసి భర్తను చంపిన మూడో భార్య



**అనుప్పూర్-నవభూమి:** తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ప్రియుడి సాయంతో హత్య చేసింది మూడో భార్య. ఆ శవాన్ని మూటగట్టి ఊరు చివర బావిలో పడేసింది. కానీ, ఆ మర్నాడు అదే బావి వద్దకు వెళ్లిన హతుడి రెండో భార్యకు ఏదో శవం తేలుతున్నట్టు కనిపించింది. అది మృతదేహం అని ఆమె భావించినా.. తన భర్త శవమే అని తెలిసి షాకయ్యింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మూడో భార్య కుట్ర వెలుగులోకి వచ్చింది. విస్తుగొలిపే ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని అనుప్పూర్ జిల్లా సకారియా గ్రామంలో ఆగస్టు 30న చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

సకారియా గ్రామానికి చెందిన భయ్యాలాల్ రజక్ (60) మూడు వివాహాలు చేసుకున్నారు. మొదటి భార్య వదిలేసి వెళ్లిపోవడంతో గుడ్డి బాయి అనే మహిళను మళ్లీ వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు సంతానం కలగలేదని ఆమె చెల్లెలు మున్ని అలియాస్ విమలను పెళ్లిచేసుకోగా.. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. కానీ, స్థానిక స్థిరాస్తి వ్యాపారి లల్లూ అలియాస్ నారాయణ్ దాస్ కుష్వాహాతో మున్నీకి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇరువురి మధ్య సంబంధం బలపడటంతో భయ్యాలాల్ అడ్డుతొలగించుకోవాలని భావించారు. ఇందుకోసం పథకం వేసి.. ధీరజ్ కోల్ (25) అనే యువకుడి సాయం తీసుకున్నారు.ఆగస్టు 30న రాత్రి నిర్మాణంలో ఉన్న తన ఇంటి వద్ద భయ్యాలాల్ నిద్రపోతుండగా హత్య చేశారు. రాత్రి 2 గంటల సమయంలో లల్లూ, ధీరజ్‌లు చొరబడి భయ్యాలాల్ తలపై ఐరన్ రాడ్‌తో కొట్టి చంపారు. అనంతరం శవాన్ని దుప్పట్లో చుట్టి, తాళ్లతో కట్టి ఊరు చివర ఉన్న బావిలో పడేశారు. కానీ, రెండో భార్య ఎంట్రీతో ఆ మర్నాడే వారి ప్లాన్ బయటపడింది. ఆ బావి పక్క నుంచి ఆమె వెళ్తుండగా ఏదో శవం తెలియాడుతున్నట్టు గమనించింది. తన భర్త మృతదేహాన్ని బంధించి, పడేసినట్లు భయంకరమైన నిజం గ్రామస్థులకు తెలియచేసింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని బావిలోని నీటిని ఖాళీ చేయించి, భయ్యాలాల్ మృతదేహం, అతడి మొబైల్ ఫోన్‌ను కూడా వెలికితీశారు.కేసు నమోదుచేసి పోస్ట్‌మార్టం కోసం తరలించగా.. తలపై బలమైన గాయాల వల్లే చనిపోయినట్టు నిర్ధారణ అయ్యింది. నిందితులు ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## గణేశ్ నిమజ్జనంలో దొంగల చేతివాటం.. 100కిపైగా ఫోన్లు, బంగారు ఆభరణాలు చోరీ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దాదాపు 11 రోజుల పాటూ పూజలందుకున్న గణనాథులకు 'మళ్లీ రావయ్యా.. గణపయ్యా..' అంటూ భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. హైదరాబాద్, ముంబై, బెంగళూరు సహా ప్రధాన నగరాల్లో అనంత చతుర్థశి సందర్భంగా శనివారం గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు.ముంబై లోని ఐకానిక్ లాల్‌బాగ్చా రాజా గణనాథుడి నిమజ్జనం ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. స్వామివారి ఊరేగింపుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ముంబై వీధులు జనసంద్రంగా మారాయి. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శించారు. దాదాపు 100కి పైగా మొబైల్ ఫోన్లు, బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మొబైల్ ఫోన్ల దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు సంబంధించి 100కి పైగా ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ నాలుగు మొబైల్ ఫోన్స్, రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్ కేసులకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు బీఆర్ఎస్ దూరం: ఎంపీ సురేశ్ రెడ్డి



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉపరాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనున్నది. ఎన్డీఏ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ జడ్జి బీ సుదర్శన్ రెడ్డి పోటీపడుతున్నారు. అయితే ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండనున్నట్లు బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని విధాలుగా ఆలోచనలు వేసి, ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర రైతులు తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో ఉన్నారని, యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, యురియా కొరతను తీర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశామని, తాము రిక్వెస్ట్ చేసినా.. రెండు ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనట్లు సురేశ్ రెడ్డి అన్నారు.ఉప రాష్ట్రపతి ఎన్నిక బ్యాలెట్‌పై నోటా అందుబాటులో లేదు కాబట్టి ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు ఎంపీ తెలిపారు. తమ నిరసనను ఈ రకంగా వ్యక్తం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ నేతలు .. బీఆర్ఎస్ పార్టీ వర్కర్లను వేధిస్తున్నారని, ఇలాంటి పరిస్థితిల్లో తమ పార్టీ నిర్ణయం తీసుకున్నదని, పార్టీ అధినేత కేసీఆర్‌తో జరిగిన చర్చల ఆధారంగా నిరసన వ్యక్తం చేసేందుకు ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను సతాయిస్తున్నాయని, ఈ కారణంతోనే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటువేయడం లేదని ఆయన అన్నారు.పోటీల్లో ఉన్న ఇద్దరు అభ్యర్థులను అమితంగా గౌరవిస్తున్నామని, ఆ అభ్యర్థులు వారివారి రంగాల్లో నిష్ణాతులని, ఓ అభ్యర్థి స్వంత రాష్ట్రానికి చెందిన వ్యక్తే అని, కానీ.. రైతులను ప్రభుత్వాలు విస్మరిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ఆయన చెప్పారు.

## వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎంపీ.. గ్రామస్తులు మోయడంతో వివాదం..

**న్యూఢిల్లీ-నవభూమి:** కుండపోత వర్షాల తో బీహార్ రాష్ట్రం లోని కతిహార్ జిల్లా అతలాకు తలమైంది. ఎడతెగని వర్షాలవల్ల అక్కడి లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎంపీ తారీఖ్ అన్వర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడం వివాదాస్పదమైంది. ఎంపీ వరద నీటిలో దిగకపోవడంతో గ్రామస్థులు వీపులపై మోసుకెళ్లారని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు.అయితే ఆ విమర్శలను కాంగ్రెస్ పార్టీ తోసిపుచ్చింది. ఎంపీకి అస్వస్థతగా ఉండటంతో గ్రామస్థులు మోసుకెళ్లారని వ్యాఖ్యానించింది. కాగా తారీఖ్ అన్వర్ కతిహార్ ఎంపీగా వ్యవహరిస్తున్నారు. వరదలు రావడంతో పరిస్థితిని పరిశీలించేందుకు రెండ్రోజులపాటు ఆయన తన నియోజకవర్గంలో పర్యటించారు. అందుకోసం పలు రకాల రవాణా సౌకర్యాలను వినియోగించారు.



# సోలో డైనింగ్.. సో బెటరూ!

మెదడు నిరంతరం పని చేస్తూనే ఉంటుంది. నిత్యం ఎన్నో ఆలోచనలు, ఆందోళనలతో సతమతమవుతూ ఉంటుంది. అలాంటి బ్రెయిన్ కూడా అప్పుడప్పుడూ విశ్రాంతి కోరుకుంటుంది. ఇలా అనుకునే వాళ్లకు మంచి ఆప్షన్‌గా 'సోలో డైనింగ్' ట్రెండ్ వచ్చేసింది. ఒంటరిగా డిన్నర్‌కు వెళ్లడం వల్ల మనసుకు ప్రశాంతంగా ఉంటుందని నేటి యువత చెబుతున్నది. సాధారణంగా ఒంటరిగా రెస్టారెంట్‌కు వెళ్లి భోజనం చేస్తుంటే.. చుట్టుపక్కల వాళ్లు విచిత్రంగా, జాలిగా చూస్తుండొచ్చు. అందుకు కారణం మనందరికీ గ్రూప్ డిన్నర్స్ మాత్రమే అలవాటు. అలాంటివాళ్లను పట్టించుకోకుండా సోలో డిన్నర్స్ ప్లాన్ చేసుకోవచ్చు. ఇలా ఒంటరిగా కూర్చుని తినడంవల్ల 'మీ టైమ్' అనేది ఉంటుంది. అలాగే మనల్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం ఆహారానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, మన మనసుకు మనం దగ్గరగా ఉండటం. ఒంటరిగా అలా ఎలా తినాలి? అనుకునేవాళ్లూ ఉంటారు. అందువల్ల సోలో డైనింగ్‌ని ఆసక్తికరంగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇంట్లో అయినా, రెస్టారెంట్‌లో అయినా ప్లేట్‌లో నచ్చిన ఆహారం, చెవిలో ఇష్టమైన మ్యూజిక్ వంటివి ఉంటే.. సోలో డైనింగ్‌ని సంతోషంగా ఆస్వాదించొచ్చు. ఇక్కడ చాలామందికి వచ్చే అనుమానం, ఒంటరిగా ఉంటే మానసిక ఆరోగ్యం ఎలా బాగుంటుంది? అని. నిజానికి ఒంటరిగా కూర్చుని భోజనం చేయడం వల్ల ఆహారాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారని, మెడిటేషన్ లాంటి ఫీలింగ్ వస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన పరిశోధనలో కూడా అప్పుడప్పుడూ చేసే సోలో డైనింగ్ మానసిక ఆరోగ్యానికి మంచిదని తేల్చారు. ఇది పని ఒత్తిడిని తగ్గించి, ఎమోషనల్ రెగ్యులేషన్‌ని మెరుగుపరుస్తుంది. కొత్తగా ఉన్నా, ఈ సోలో డైనింగ్ కాన్సెప్ట్ బాగుంది కదూ!



# ఆ గడ్డలకు అడ్డుకట్ట సులభమే



**గర్భాశయం లోపల తలెత్తే ఫైబ్రాయిడ్స్ పునరుత్పత్తికి ఆటంకం కలిగించవచ్చు. తీవ్రమైన నెలసరి స్రావాలతో ఇబ్బందికి పెడుతూ ఉండొచ్చు. అలాగని అంతిమ పరిష్కారంగా సర్జరీని ఆశ్రయించవలసిన అవసరం లేదు. 'యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్'తో, సర్జరీతో పని లేకుండానే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. అదెలాగో వైద్యులు వివరిస్తున్నారు**


ప్రమాదానికి గురైన బాధితుల్లో అంతర్గత రక్తస్రావాలను అడ్డుకోవడం కోసం వైద్యులు 'ఇమేజ్ గైడింగ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ' మీద ఆధారపడుతూ ఉంటారు. ఈ విధానంలో భాగంగా ఇంటర్వెన్షనల్ రేడియాజలిస్టలు, ఇమేజ్ గైడెన్స్ ఆధారంగా రక్తనాళాలను గుర్తించి, వాటిలో అవరోధం కల్పించడం ద్వారా రక్తస్రావాన్ని అదుపులోకి తీసుకొస్తూ ఉంటారు. ఇదే విధానాన్ని ఫైబ్రాయిడ్స్ చికిత్సలో కూడా వాడుకోవచ్చు. ఫైబ్రాయిడ్స్‌కు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలను అడ్డుకోవడం ద్వారా, రక్తప్రసారానికి అడ్డుకట్ట వేసినప్పుడు ఫైబ్రాయిడ్స్ కుంచించుకుపోతాయి. తద్వారా వాటి వల్ల తలెత్తే సమస్యలన్నీ అదుపుకోలొస్తాయి. ఈ చికిత్సే యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్. నిజానికి ఈ చికిత్స కొత్తదేమీ కాదు. ఎంతో కాలంగా వాడుకలో ఉన్నదే! కానీ దీని పట్ల మహిళలకు అవగాహన తక్కువ.

పునరుత్పత్తి వయసులో ఉన్న 60 శాతం మంది మహిళల్లో గర్భాశయ ఫైబ్రాయిడ్స్ తలెత్తుతూ ఉంటాయి. ఇవి క్యాన్సర్ గడ్డలు కాకపోయినా, వాటితో తలెత్తే తీవ్ర నెలసరి స్రావాలు, నొప్పులతో వైద్యులను కలిసినప్పుడు వైద్యులు, మొదట మందులతో తర్వాత సర్జరీతో సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. గర్భాశయం జోలికి వెళ్లకుండా కేవలం ఫైబ్రాయిడ్స్‌ను మాత్రమే తొలగించే సర్జరీ (మయోమెక్టమీ)తో పాటు, కొన్ని సందర్భాల్లో గర్భాశయాన్నే తొలగించే సర్జరీ (హిస్ట్రక్టమీ) అవసరమవుతూ ఉంటుంది. అయితే ఈ రెండు రకాల సర్జరీలతో పని లేకుండా, కేవలం ఫైబ్రాయిడ్స్ లక్ష్యంగా చేసే చికిత్సే యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్. కోత, కుట్లు లేకుండా యాంజియోగ్రామ్ మాదిరిగా చేయి, లేదా కాలిలోని రక్తనాళం ద్వారా సమస్యను పరిష్కరించే చికిత్స ఇది. యాంజియోగ్రామ్ మాదిరిగానే ఈ చికిత్సలో కూడా అదే తరహా క్యాథ్ ల్యాబ్ సాంకేతికతను ఉపయోగించుకుని, ఫైబ్రాయిడ్స్‌కు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలకు చిన్నపాటి క్యాథెటర్స్‌తో అవరోధం కల్పిస్తారు. రక్తసరఫరాకు అడ్డుకట్ట వేసినప్పుడు ఫైబ్రాయిడ్స్‌కు అందవలసిన పోషణ కొరవడి, అవి కుంచించుకుపోయి, జీవం కోల్పోతాయి. దాంతో వాటి సమస్య తొలగిపోతుంది.

సాధారణంగా ఫైబ్రాయిడ్ సర్జరీలతో కొన్ని సమస్యలుంటాయి. 5 నుంచి 10 శాతం దీర్ఘకాల సమస్యలు తలెత్తే అవకాశాలు కూడా ఉంటాయి. కోత, కుట్లు, రక్తస్రావంతో పాటు సర్జరీ తర్వాత అంతర్గత అవయవాలు అతుక్కోవడం లాంటి సమస్యలూ ఉండొచ్చు. సర్జరీ నుంచి కోలుకోడానికి కనీసం నెల సమయం పట్టొచ్చు. అలాగే మయోమెక్టమీతో గర్భాశయంలోని అన్ని ఫైబ్రాయిడ్స్‌నూ తొలగించే సౌలభ్యం ఉండదు. కాబట్టి ఈ సర్జరీతో పోలిస్తే యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్ అన్ని విధాలా సౌకర్యవంతమైనదని చెప్పొచ్చు. దీన్లో కోత, కుట్లు ఉండవు. రక్తస్రావం ఉండదు. అనస్థీషియా అవసరం లేదు. ఒక్క రోజులోనే చికిత్స ముగించుకుని ఇంటికెళ్లిపోవచ్చు. మయోమెక్టమీ సర్జరీతో ఫైబ్రాయిడ్స్ తొలగించినంత మాత్రాన అవి మళ్లీ తలెత్తవనే భరోసా లేదు. 20 నుంచి 30 శాతం మందికి పదేళ్ల కాలంలో ఫైబ్రాయిడ్స్ తిరగబెట్టొచ్చు. ఇలాంటి సందర్భాల్లో అప్పటికే పిల్లలున్న మహిళలు గర్భాశయాన్ని తొలగించే సర్జరీలను ఎంచుకుంటూ ఉంటారు. కానీ 30 ఏళ్ల వయసులో గర్భాశయాన్ని తొలగించడం వల్ల మహిళలకు గుండె జబ్బుల ముప్పు పొంచి ఉంటుంది. కటి ప్రదేశం బలహీనపడొచ్చు. సర్జరీ వల్ల కడుపులో పేగులు అతుక్కుపోయి, అందుకోసం రెండోసారి సర్జరీ చేసే పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి గర్భాశయంతో పని పూర్తయింది కాబట్టి దాన్ని తొలగించుకుని ఫైబ్రాయిడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోవాలనుకోవడం సరైన నిర్ణయం కాదు.

**పునరుత్పత్తి సమస్యల ముప్పు**

సాధారణంగా పునరుత్పత్తి వయసులో ఉన్న మహిళలకు ఫైబ్రాయిడ్స్‌ను మాత్రమే తొలగించే మయోమెక్టమీ సర్జరీని వైద్యులు సూచిస్తారు. కానీ ఈ సర్జరీతో పునరుత్పత్తి సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్‌తో కూడా పునరుత్పత్తి సమస్యల ముప్పు ఉన్నప్పటికీ, మయోమెక్టమీతో పోలిస్తే ఆ ముప్పు కొంత తక్కువేనని చెప్పొచ్చు. కాబట్టి ఫైబ్రాయిడ్స్‌కు సర్జరీ వద్దనుకునేవారు, ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవాలనుకునే ఆలోచన ఉన్నవారు నిస్సందేహంగా యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్‌ను ఎంచుకోవచ్చు. ఈ చికిత్సతో ఐదేళ్ల వరకూ ఫైబ్రాయిడ్స్ నుంచి విడుదల పొందవచ్చు. 30లలో ఉన్న మహిళల్లో ఐదేళ్ల తర్వాత తిరిగి ఫైబ్రాయిడ్స్ తలెత్తే అవకాశాలు 20శ్రీ మేరకు ఉంటాయనే విషయాన్ని కూడా మహిళలు గుర్తు పెట్టుకోవాలి. 40లలో ఉన్న మహిళలకు ఈ చికిత్సా విధానంతో ఒరిగే ప్రయోజనం ఎక్కువ, ఫైబ్రాయిడ్స్ తిరబెట్టే ముప్పు తక్కువ.



**గైనకాలజీ కీలకమే!**

ఫైబ్రాయిడ్స్ పెరుగుదల హార్మోన్ల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి పునరుత్పత్తి వయసులో ఉధృతంగా వేధించే ఫైబ్రాయిడ్స్, మెనోపాజ్ దశకు చేరుకునే సమయానికి వాటంతట అవే తగ్గిపోతాయి. కాబట్టి ఆ సమయంలో సర్జరీతో పని లేకుండా తేలికపాటి మందులతోనే పరిస్థితిని అదుపులోకి తెచ్చుకోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో గైనకాలజీ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ పునరుత్పత్తి వయసులో ఉన్న కొందరికి ఫైబ్రాయిడ్స్ వల్ల తీవ్ర నెలసరి స్రావంతో రక్తలేమికి గురి కావడం, నొప్పితో బాధపడడం లాంటి లక్షణాలుంటాయి. అలాగే ఫైబ్రాయిడ్స్‌తో మూత్రాశయం మీద పెరిగే ఒత్తిడి వల్ల తరచూ మూత్రవిసర్జన చేయవలసి వస్తూ ఉంటుంది. ఈ సమస్యలతో జీవన నాణ్యత దెబ్బతినే పరిస్థితి ఉన్నప్పుడు గైనకాలజిస్టలను కలవడం అవసరం. అయితే సర్జరీ తప్ప మరొక పరిష్కారం లేదని వైద్యులు సూచించినప్పుడు, యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్ ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలి.

# నిత్యపూజ కోసం పువ్వులు సమకూర్చుకోవడం కష్టమవుతోందా..



అష్టోత్తర నామాలతో పాటు అష్టోత్తర పుష్పాలనూ సమర్పించడం మన పూజా విధానంలో భాగం. నిత్యపూజ కోసం అన్ని పువ్వులు సమకూర్చుకోవడం కష్టమనే ఉద్దేశంతో కొంతమంది రజత పుష్పాలను ఎంచుకుంటారు. నూట ఎనిమిది వెండిపూలు ఓ సెట్టుగా కలువ మొగ్గల ఆకారంలో.. వెండి రంగులో లభించేవి ఇన్నాళ్లూ. ఇప్పుడు, అసలు పువ్వులకు దీటుగా ఎన్నో వన్నెల్లో తయారు చేస్తున్నారు స్వర్ణకారులు.

సువర్ణ, రజతాలకు మన సంప్రదాయంలో పవిత్ర స్థానం ఉంది. ఒకప్పుడు మహారాణులు బంగారు పువ్వులతో పూజలు చేసేవారని అంటారు. కలవారి కోడలిని ఉద్దేశించి, 'బంగారు పువ్వులతో పూజ చేసుకున్నట్టుంది. ఎంత గొప్ప జీవితం అనుభవిస్తున్నదో!' అనుకునేవారు. ఇక, ఈ రోజుల్లో బంగారం ప్రియం కావడంతో వెండిపూల సెట్లు ఆ స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. అచ్చంగా వెండి రంగులోనే కనిపించేవే కాదు, బంగారు పూత పూసినవీ వస్తున్నాయి. వాటిలోనూ వైవిధ్యాన్ని కోరుకునేవారి కోసం 'ఎనామిల్ ఫ్లవర్లు' ముస్తాబవుతున్నాయి.

రకరకాల ఆకృతుల్లో, చూడచక్కని వర్ణాల్లో ఎనామిల్ పువ్వుల్ని తయారు చేస్తున్నారు. గులాబీ వన్నెలు చిందించే తామర పూలు, వింత రంగుల్లో విరిసే గన్నేరులు, ఎరుపు, పసుపు వర్ణాల్లో మందారాలు.. ఇలా అనేకరకాల పుష్పాలు వస్తున్నాయి. విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకునేలా.. వీటిని తీర్చిదిద్దుతున్నారు. అర్చనకు వాడే నూట ఎనిమిది పువ్వుల సెట్లే కాదు, దేవుడి అలంకరణకు పనికొచ్చేందుకూ రకరకాల పువ్వుల్ని రూపొందిస్తున్నారు.



# కళ్లు పొడిబారుతున్నాయా?

**కళ్లలో నీళ్లు తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల అవి కంటిని తేమగా ఉంచేందుకు సరిపోక కళ్లు పొడిబారుతుంటాయి. కళ్లలో నీళ్లు త్వరగా ఆవిరైపోతున్నా కూడా ఈ సమస్య వస్తుంది. దీనివల్ల కళ్లు దురదగా ఉండడం, ఎర్రబడడం, మంట అనిపించడం, వెలుగును చూడలేకపోవడం, ఏదో పడినట్లుగా గుచ్చుతుండడం లాంటి అసౌకర్యాలు కలుగుతాయి. కొన్ని ఇంటి చిట్కాలతో వీటినుంచి ఉపశమనం పొందవచ్చు. అవి...**



**వేడి గుడ్డతో ఒత్తడం:** మెత్తని గుడ్డ లేదా కొంచెం దూదిని తీసుకుని వేడి నీటిలో ముంచి గట్టిగా పిండండి. దీనిని గుండ్రంగా మడిచి మూసిన కంటి రెప్పల మీద ఉంచి చిన్నగా ఒత్తండి. వెంటనే కంటి రెప్పల్లో ఉన్న నూనె గ్రంథులు పూర్తిగా తెరుచుకుంటాయి. కంటిలో సన్నని నూనె పొర పరచుకుంటుంది. దీనివల్ల కంటిలో గరగర, మంట, దురద తగ్గుతాయి.

తేమగా ఉండేలా: కళ్లు పొడిబారకుండా నీళ్లతో నిండి తేమగా ఉండాలంటే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కళ్లలో నీళ్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దాహం అనిపించకపోయినా ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్లాసు మంచినీళ్లు తాగాలి. కళ్లలోకి ఎక్కువగా వెలుతురు, దుమ్ము సోకకుండా జాగ్రత్త తీసుకోవాలి.

కలబందతో: కలబంద ఆకు నుంచి గుజ్జును తీసుకుని మంచినీటిలో ముంచి తీయాలి. దీనిని మూసిన కంటి రెప్పల మీద పరచాలి. ఇది కంటిలోపలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. పది నిముషాల తరవాత కళ్లను కడగాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే కలబందలోని ఔషధ గుణాల వల్ల కళ్లవాపు, దురద తగ్గుతాయి.

**20-20-20 నిబంధనతో:** ఎక్కువసేపు కంప్యూటర్‌ను చూస్తూ పనిచేయడం వల్ల రెప్పపాటు తగ్గి కళ్లు పొడిబారుతాయి. రెప్పపాటు వల్లనే కన్నీళ్లు వ్యాపించి కన్ను మొత్తం తేమగా ఉంటుంది. అందుకే ఈ 20-20-20 నిబంధనను పాటించాలి. ఇందులో ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని 20 సెకండ్లపాటు చూస్తూ ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కంప్యూటర్ స్క్రీన్ వల్ల కలిగే అలసట తగ్గి కన్ను విశ్రాంతి పొందుతుంది. పచ్చని చెట్లను, ఆకాశాన్ని, ఎగిరే పక్షులను, పారే నీటిని చూస్తున్నా కూడా కళ్లకు తేలికపాటి వ్యాయామం చేసినట్లవుతుంది.

**కీరాతో:** కీరాను సన్నని చక్రాలుగా కోసి కళ్లమీద ఉంచుకోవాలి. కనీసం పావుగంటసేపు కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోవాలి. కీరాలో ఉన్న నీరు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి చుట్టూ ఉన్న చర్మానికి తేమని అందించి కళ్లకు చల్లదనాన్ని కలిగిస్తాయి. కళ్లలో దురద తగ్గుతుంది. చల్లని పాలలో దూదిని ముంచి కళ్లమీద ఉంచుకున్నా కూడా కళ్లు విశ్రాంతి పొందుతాయి.

# పండ్లు కూరగాయలను ఎలా శుభ్రం చేయాలంటే

మనం బజారు నుంచి తెచ్చుకున్న పండ్లు, కూరగాయలు తాజాగా కనిపిస్తున్నప్పటికీ వాటిమీద పురుగు మందుల అవశేషాలు, కొన్ని రకాల రసాయనాలు, దుమ్ము, ధూళి, క్రిమికీటకాల గుడ్లు లాంటివి ఉండవచ్చు. వీటివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఏర్పడుతుంటాయి. అందుకే పండ్లను తినేముందు, కూరగాయలను వండేముందు సరైన విధానంలో శుభ్రం చేయాలంటున్నారు నిపుణులు.

ఆ వివరాలు...కూరగాయలను ముందుగా ఉప్పు, పసుపు కలిపిన నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాతనే ముక్కలుగా తరగాలి. ఒకవేళ వాటిని నిల్వ చేసుకోవాలనుకుంటే మాత్రం ముందుగా కడగకూడదు. అలా కడిగితే తేమ వల్ల బ్యాక్టీరియా పెరిగి కూరగాయలు తొందరగా పాడవుతాయి. ఆకుకూరలకు ముందుగా కాడలు తుంచి శుభ్రం చేయాలి. తరవాత ఆ ఆకులను జల్లి బుట్టలో వేసి పంపు నీళ్ల ధార కింద పెట్టి కడగాలి. ఇసుక, మట్టి లాంటివి పూర్తిగా పోయే వరకూ ఆకులను చేత్తో రుద్దుతూ కడగాలి. వర్షాకాలంలో మాత్రం ఆకులను కొద్దిసేపు ఉప్పునీటిలో నానబెట్టడం మంచిది. క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌లను ఉప్పు నీళ్లలో పావుగంటసేపు ఉంచితే వాటిలోని పురుగులు బయటికి వచ్చేస్తాయి. బంగాళదుంప, చామదుంప, చిలకడ దుంప, కంద, ముల్లంగి, అల్లం, కేరట్‌లను మెత్తని బ్రష్ లేదా స్పాంజ్‌తో రుద్దుతూ కడిగితే వాటికి అంటుకుని ఉన్న మట్టి, బ్యాక్టీరియా తొలగిపోతాయి.



## లాభాలతో ప్రారంభం.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

**ముంబై-నవభూమి:**జీఎస్టీ సంస్కరణలు దేశీయ సూచీలకు మంచి బూస్టింగ్ ఇస్తున్నాయి. జీఎస్టీ నూతన సంస్కరణలు మదుపర్లలో విశ్వాసాన్ని కలిగించడంతో సూచీలు ఈ వారాన్ని కూడా లాభాలతో ప్రారంభించాయి. ఈ నెల 12వ తేదీన ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కాబోతున్నాయి. ఇక, జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు దేశ అభివృద్ధికి సహకరిస్తాయని విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో కొనసాగుతున్నాయి గత శుక్రవారం ముగింపు (80, 710)తో




పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 200 పాయింట్ల లాభాలతో మొదలైన సెన్సెక్స్ ఆ ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. ఒక దశలో దాదాపు 400 పాయింట్లు లాభపడి 81 వేల మార్క్‌ను కూడా క్రాస్ చేసింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 102 పాయింట్ల లాభంతో 80, 813 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 42 పాయింట్ల లాభంతో 24, 783 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో భారత్ ఫోర్జ్, సోనా బీఎల్‌డబ్ల్యు, టాటా మోటార్స్, సెయిల్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. అంబర్ ఎంటర్‌ప్రైజెస్, వేదాంత, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, అవెన్యూ సూపర్ మార్కెట్, సుప్రీమ్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 377 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 6 పాయింట్ల స్వల్ప లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.27గా ఉంది.

## స్థిరంగా బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




**ముంబై-నవభూమి:**దేశీయంగా బంగారం ధర ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సెప్టెంబర్ 8న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 08, 480కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 99, 440కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 08, 610కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 99, 590కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 08, 480కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 99, 440కి చేరింది (%+శీశ్రీస జూతీఅఎవ అఅ ఎఎవతీఖఎుఎ%). వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 1, 08, 480, రూ. 99, 440
విజయవాడలో రూ. 1, 08, 480, రూ. 99, 440
ఢిల్లీలో రూ. 1, 08, 610, రూ. 99, 590
ముంబైలో రూ. 1, 08, 480, రూ. 99, 440
వడోదరలో రూ. 1, 08, 510, రూ. 99, 490
కోల్‌కతాలో రూ. 1, 08, 480, రూ. 99, 440
చెన్నైలో రూ. 1, 08, 480, రూ. 99, 440
బెంగళూరులో రూ. 1, 08, 480, రూ. 99, 440
కేరళలో రూ. 1, 08, 480, రూ. 99, 440
పుణెలో రూ. 1, 08, 480, రూ. 99, 440

## 25,000 వద్ద అప్రమత్తం



**న్యూఢిల్లీ-నవభూమి:** గత వారం పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమై కీలక స్థాయి 25,000 వరకు వెళ్లినా రియాక్షన్‌కు లోనయింది. చివరికి వారం మొత్తానికి 314 పాయింట్ల లాభంతో 24,740 వద్ద ముగిసింది. నిఫ్టీ గత వారం పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమై కీలక స్థాయి 25,000 వరకు వెళ్లినా రియాక్షన్‌కు లోనయింది. చివరికి వారం మొత్తానికి 314 పాయింట్ల లాభంతో 24,740 వద్ద ముగిసింది. నిఫ్టీ వారం మధ్య స్థాయిలో ముగియడం అప్రమత్త, అనిశ్చిత ధోరణి సంకేతం. మార్కెట్ గత కొద్ది వారాల్లో పరిమిత పరిధిలో చిక్కుకుని 25,000 స్థాయిలో సైడ్‌వేస్ ధోరణిలో ట్రేడయింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు కూడా అదే ధోరణి ప్రదర్శించాయి. నిఫ్టీ గత వారం 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడం, శుక్రవారం అమెరికన్ ఈక్విటీ మార్కెట్లలో ఏర్పడిన బలహీనత కారణంగా ఈ వారంలో ఇండెక్స్ 25,000 కన్నా పైన దృఢంగా నిలబడితే తప్ప అప్రమత్త ధోరణి ప్రదర్శించే ఆస్కారం ఉంది. బుల్లిష్ స్థాయిలు: మైనర్ పాజిటివ్ ట్రెండ్ కోసం నిఫ్టీ మైనర్ నిరోధం 24,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ప్రధాన నిరోధం 25,000. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక పాజిటివ్ సూచన వెలువడుతుంది. బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,500. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 460 పాయింట్ల మేరకు రికవరీ సాధించి 54,115 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 54,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 55,000. బలహీనత ప్రదర్శించినా ప్రధాన మద్దతు స్థాయి 53,500 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. పాటర్న్: నిఫ్టీ 50, 100 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి. అలాగే 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.


టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు
నిరోధం : 24,850, 24,940
మద్దతు : 24,700, 24,580

## ఐటీఆర్ ఫైలింగ్ గడువు పెంచాలని డిమాండ్..మరో ఛాన్స్ ఇస్తారా..

**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణంగా ప్రతి ఏడాది జూలై 31తో ఐటీఆర్ ఫైలింగ్ కంప్లీట్ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది, అంటే 2024-25 ఆర్థిక సంవత్సరానికి (2025-26 అసెస్మెంట్ ఇయర్) సంబంధించి కొన్ని టెక్నికల్ సమస్యలు, లేట్‌గా యుటిలిటీలు రిలీజ్ కావడం, డేటా మిస్ మ్యాచ్ వంటి కారణాలతో గడువు పెంచారు. దీంతో ఇప్పటికే ఐటీ డిపార్ట్‌మెంట్ ఒకసారి గడువును జూలై 30 నుంచి సెప్టెంబర్ 15, 2025 వరకు పొడిగించింది . ఇది ఆడిట్ అవసరం లేని వ్యక్తులు, , ఇతర సాధారణ ట్యాక్స్‌పేయర్లకు వర్తిస్తుంది.

# గణేష్ చతుర్థితో దేశంలో ఎన్ని వేల కోట్ల బిజినెస్ జరిగిందంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో గణేష్ చతుర్థి అంటే రంగు రంగుల పందిళ్లు, డీజే మోతలు, భక్తితో కూడిన ఉత్సాహం గుర్తుకొస్తాయి. కానీ ఈ పండగ కేవలం భక్తి, సంస్కృతి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊపు తెచ్చిందని చెప్పవచ్చు.ఎందుకంటే ఈ ఏడాది గణేష్ చతుర్థి సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు రూ. 45,000 కోట్ల వ్యాపారాన్ని తెచ్చిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది. గత ఏడాది రూ.25,000 కోట్ల వ్యాపారం జరిగినట్లు తెలిపింది. ఈసారి పూర్తిగా స్వదేశీ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అనేక వ్యాపార రంగాలకు మేలు జరిగిందని చెప్పింది.

**విగ్రహాలే రూ. 1000 కోట్ల వ్యాపారం**

జాతీయ అధ్యక్షుడు బీసీ భారతియా చెప్పినట్లు, గణేష్ చతుర్థి సమయంలో ఒక్క గణపతి విగ్రహాల వ్యాపారమే రూ. 1000 కోట్లకు పైగా జరిగింది. అంతేకాదు పుష్పాలు, దండలు, కొబ్బరికాయలు వంటి అవసరమైన సామగ్రి కొనుగోళ్లు మరో రూ. 500 కోట్ల బిజినెస్ అయ్యింది. ఇక మోదకాలు, ఇతర స్వీట్ల డిమాండ్ ద్వారా రూ. 2,000 కోట్లను దాటేసింది. పండగ సమయంలో కేటరింగ్, స్నాక్స్ సర్వీసులు రూ. 3,000 కోట్ల వ్యాపారాన్ని సృష్టించాయి.

**పందిళ్లతో రూ. 10,000 కోట్ల ఖర్చు**

ఈ ఏడాది దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షల గణేష్ పందిళ్లు ఏర్పాటయ్యాయి. ఒక్క మహారాష్ట్రలోనే 7 లక్షల పందిళ్లు, కర్ణాటకలో 5 లక్షలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్‌లలో ఒక్కో చోట 2 లక్షల చొప్పున పందిళ్లు వెలిశాయి. ఒక్కో పందిరికి కనీసం రూ. 50,000 ఖర్చు చేసినా, అలంకరణలు, ఏర్పాట్లు, పూజల కోసం మొత్తం రూ. 10,000 కోట్లకు పైగా ఖర్చయిందని భారతియా వెల్లడించారు. టూరిజం,

**రిటైల్‌కు ఊపు**

గణేష్ చతుర్థి కేవలం పూజలు, పందిళ్లతోనే ఆగలేదు. ఈ పండగ స్థానిక టూరిజం, బస్సులు, క్యాబ్‌లు, రైళ్ల వ్యాపారాలకు రూ. 2,000 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. బట్టలు, ఆభరణాలు, హోమ్ డెకర్, గిఫ్ట్ ఐటెమ్‌ల రిటైల్ వ్యాపారం రూ. 3,000 కోట్లకు చేరింది. పెద్ద ఎత్తున ఈవెంట్‌లు నిర్వహించే ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు రూ. 5,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి.

గణేష్ చతుర్థి మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు, గోవా వంటి రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చిందని సెక్రటరీ జనరల్ ఎమెరిటస్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. రక్షా బంధన్‌తో మొదలైన పండగల సీజన్ గణేష్ చతుర్థి, నవరాత్రులు, దసరా, కర్వా చౌత్, దీపావళి, ఛత్ పూజ ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్‌తో భారత ఆర్థిక వ్యవస్థ ఊపందుకోనుందని అంచనా వేసింది.

# 15 నుంచి యూపీఐ కొత్త రూల్స్..




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) దూసుకెళ్తోంది. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటానే 80 శాతం వరకు ఉంటున్నట్లు పలు నివేదికలు చెబుతున్నారు. ఈ క్రమంలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%చీూజ×%) ఎప్పటికప్పుడు కీలక మార్పులు చేస్తూ వస్తోంది. యూజర్ల భద్రతకు భరోసా కల్పిస్తూ ట్రాన్సాక్షన్ లిమిట్ సైతం పెంచుతోంది. మరోసారి యూపీఐలో కొత్త మార్పులు అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఎంపిక చేసిన వర్గాలకు ట్రాన్సాక్షన్ పరిమితులను పెంచుతున్నట్లు తెలిపింది. ముఖ్యంగా వ్యాపారాలు చేసే వారు, పెద్ద మొత్తంలో ట్రాన్సాక్షన్లు చేసే వారికి ఈ కొత్త రూల్స్ ఉపయోగపడనున్నాయి. సెప్టెంబర్ 15, 2025 నుంచే ఈ కొత్త రూల్స్ అమలులోకి తీసుకురానున్నారు. యూపీఐ కొత్త రూల్స్ ప్రకారం.. ఒక యూజర్ 24 గంటల్లో (ఒక్క రోజులో) రూ.10 లక్షల వరకు ట్రాన్సాక్షన్ చేయవచ్చు. అయితే, ప్రత్యేక ధ్రువీకరణ పొందిన వారు, వ్యాపారులకు ఇది వర్తిస్తుంది. అయితే, ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తి మధ్య జరిగే ట్రాన్సాక్షన్ల పరిమితుల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం వారు రోజుకు రూ.1 లక్ష వరకు పంపించవచ్చు. ఆ లిమిట్‌లో ఎలాంటి మార్పులు లేవని గమనించాలి. ఎంపిక చేసిన వారికి మాత్రమే రూ.10 లక్షల వరకు అవకాశం కల్పిస్తున్నారు.

క్యాపిటల్ మార్కెట్ పెట్టుబడులు, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల వంటి వాటి కోసం అయితే యూపీఐ లిమిట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నారు. 24 గంటల్లో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు అనుమతిస్తారు. ఇక ట్రావెలింగ్ సెక్టార్‌లో ట్రాన్సాక్షన్ లిమిట్ రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారు. రోజులో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు అవకాశం ఉంటుంది. మరోవైపు.. క్రెడిట్ కార్డుల బిల్లుల కోసం అయితే ఒకేసారి రూ.5 లక్షల వరకు చేసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే, రోజు వారీ లిమిట్ రూ.6 లక్షలు ఉంటుంది.

రుణాల ఈఎంఐల చెల్లింపుల పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. అయితే ఒక రోజులో గరిష్ఠంగా రూ.10 లక్షలే పంపించవచ్చు. బంగారం, వెండి, డైమండ్ ఆభరణాల కొనుగోళ్ల కోసం రూ.1 లక్షగా ఉన్న పరిమితిని రూ.2 లక్షలకు పెంచారు. అయితే, ఒక రోజులో గరిష్ఠంగా రూ.6 లక్షల వరకే అనుమతి ఉంటుంది. ఇగ బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ విధానం ద్వారా టర్మ్ డిపాజిట్లలో ఒక రోజుకు రూ.5 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. ఇప్పటి వరకు ఈ పరిమితి రూ.2 లక్షలుగా ఉండగా దానిని రూ.5 లక్షలకు పెంచారు. ట్రాన్సాక్షన్ లిమిట్ పెంచుతూనే రోజు వారీ గరిష్ఠ పేమెంట్ల పరిమితులు విధించింది ఎన్‌పీసీఐ. పెరిగిపోతున్న సైబర్ మోసాల నుంచి యూపీఐ యూజర్లను రక్షించేందుకు ఈ మేరకు రోజు వారీ గరిష్ఠ లిమిట్ పెట్టినట్లు తెలుస్తోంది.

# 'ఆ బెనిఫిట్స్ ఏం లేవ్'.. జీఎస్టీ తగ్గింపుపై


## బాంబు పేల్చిన ట్యాక్స్ విభాగం.. ఏం జరిగిందంటే?




**న్యూఢిల్లీ-నవభూమి:**2.0: వస్తు సేవల పన్ను జీఎస్టీలో మార్పులు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. జీఎస్టీ 2.0లో కేవలం రెండు పన్ను శ్లాబులు 5, 18 శాతం ఉంటాయి. 12, 28 శ్లాబులను తొలగించారు. దీంతో చాలా రకాల వస్తువులు, సేవలపై పన్నుల భారం తగ్గి ప్రజలకు ప్రయోజనాలు అందనున్నాయి. ఈ క్రమంలోనే జీఎస్టీ కొత్త రూల్స్ గురించి చాలా రకాలుగా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ఓ వైరల్ పోస్టుపై కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ విభాగం (%జదీ×జ%) క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోకి వస్తోన్న జీఎస్టీ కొత్త రూల్స్ కింద కొత్త ట్రాన్సిషన్ బెనిఫిట్స్ ఉంటాయన్న ప్రచారాన్ని ఖండించింది. అలాంటి బెనిఫిట్స్ ఏం లేవని తేల్చేసింది. ఈ మేరకు ఆ ప్రకటన జారీ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్ విభాగం (సీబీఐసీ) ఛైర్మన్ ఓ ప్రకటన చేశారంటూ సోషల్ మీడియాలో జీఎస్టీ బెనిఫిట్స్‌కి సంబంధించి ఓ పోస్ట్ సర్క్యులేట్ అవుతోంది. జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయని, ప్రధానంగా యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, మినహాయింపు ఉన్న సరఫరాల ఐటీసీ వంటివి ఉంటాయని ఆ పోస్టులో రాసుకొచ్చినట్లు సీబీఐసీ తెలిపింది. సెప్టెంబర్ 22, 2025 నుంచి ఈ కొత్త ధరల సవరణ అమలులోకి తెస్తున్నట్లు సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు పోస్ట్ పేర్కొందని, అది తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. అలాంటి ప్రచారాలు తప్పుడు, తప్పుదారి పట్టించేవి అని తెలిపింది. సీబీఐసీ ప్రకటన ప్రకారం.. ' జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయంటూ సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఓ పోస్టు మా దృష్టికి వచ్చింది. అన్‌యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, ఎగ్జెంప్టెడ్ సప్లాయిస్ ఐటీసీ, కొత్త ధరల సవరణ బెనిఫిట్స్ వంటివి అందులో క్లెయిమ్ చేశారు. అటువంటి వాదనలు వాస్తవంగా తప్పు, తప్పుదారి పట్టించేవని తెలియజేస్తున్నాం' అని పేర్కొంది. దేశ ప్రజలు, ట్రేడ్ యూనియన్లు, ఇండస్ట్రీ కమ్యూనిటీల సభ్యులు, ఇతర భాగస్వామ్యులు ఇలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది. ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, ఎఫ్ఏక్యూలను మాత్రమే చూడాలని కోరింది. దాని ద్వారానే తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకోవాలని స్పష్టం చేసింది. సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన జీఎస్టీ 56వ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలకు ఆమోదం లభించింది. దీంతో దేశంలో రెండు శ్లాబుల వ్యవస్థ అమలు కాబోతోంది. 5, 18 శాతం మాత్రమే జీఎస్టీ శ్లాబులు ఉంటాయి. అయితే, సైన్ గూడ్స్, లగ్జరీ వస్తువులకు సంబంధించి 40 శాతం ట్యాక్స్ శ్లాబ్ తీసుకొస్తున్నారు. వాటి ధరలు అమాంతం పెరుగుతాయి. కానీ, చాలా వరకు నిత్యావసర వస్తువుల ధరలు దిగివస్తాయని చెప్పవచ్చు. 12, 28 శాతం శ్లాబులను పూర్తిగా తొలగించారు.

# మీకు ట్యాక్స్ 'రీఫండ్' తక్కువ వచ్చిందా?

## వెంటనే ఇలా చేయండి.. ఐటీ శాఖ కీలక సూచన




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకే గడువు ఉంది. ఈ క్రమంలో ట్యాక్స్ పేయర్లు తమ రీఫండ్ ఫైల్ చేస్తున్నారు. ఇప్పటికే 5 కోట్ల మందికిపైగా ఫైల్ చేసినట్లు తెలుస్తోంది. అందులో చాలా వరకు ఇ-వెరిఫికేషన్ పూర్తి రీఫండ్ కోసం చూస్తున్నారు. ఐటీ శాఖ ప్రాసెసింగ్ చేసి రీఫండ్ జారీ చేస్తోంది. సాధారణంగా ప్రాసెసింగ్ కోసం 4-5 వారాల సమయం పడుతుంది. ఆతర్వాత ట్యాక్స్ పేయర్ల ఖాతాల్లో రీఫండ్ సొమ్ము డిపాజిట్ చేస్తారు. అయితే అంతకు ముందే ప్రాసెసింగ్ పూర్తయినట్లుగా ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 143(1) కింద ఎస్ఎంఎస్, మెయిల్ ద్వారా పూర్తి వివరాలతో నోటీసు జారీ చేస్తారు. మీకు సైతం సెక్షన్ 143(1) కింద సమాచార నోటీసు వచ్చినట్లయితే ఆ వివరాలు ఓసారి తనిఖీ చేసుకోవాలి. అందులో మీకు రావాల్సిన రీఫండ్ కంటే తక్కువ చూపించినట్లయితే పూర్తి వివరాలు చెక్ చేయాలి. ఐటీ శాఖ ఏ అంశాలను పరిగణనలోకి తీసుకుని ట్యాక్స్ లెక్కగట్టింది అనేది తెలుసుకోవాలి. ఒకవేళ తప్పుగా పన్ను లెక్కవేసినట్లు గుర్తించినట్లయితే మీరు అనుకున్న విధంగా ఎక్కువ రీఫండ్ పొందేందుకు అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్, సెక్షన్ 154 కింద దిద్దుబాటు అభ్యర్థన సమర్పించాల్సి ఉంటుంది.'సెక్షన్ 143(1)కింద జారీ చేసిన నోటీసులో ట్యాక్స్ రీఫండ్ లెక్కలు తప్పుగా ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సరిచేసి తగిన రీఫండ్ ఇవ్వాలని కోరుతూ సెక్షన్ 154 కింద రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ చేయవచ్చు. ఇ-ఫైలింగ్ వెబ్?సైట్ ద్వారా సమర్పించవచ్చు. సెంట్రల్ ప్రాసెసింగ్ కమిటీ ప్రాసెసింగ్ పూర్తి చేసిన ఐటీ రిటర్నులకే ఇది వర్తిస్తుంది. మిగితా వాటికి అవకాశం ఉండదు. అయితే మీకు ఇంకా ఎక్కువ రీఫండ్ రావాలని కోరేందుకు సరైన ఆధారాలు ఇవ్వాలి. ఇతర తప్పులు జరిగినప్పుడు రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ చేయడం కుదరదు. అలాగే ఆర్థిక సంవత్సరం పూర్తైన 4 ఏళ్ల తర్వాత దిద్దుబాటు అభ్యర్థనకు అవకాశం ఉండదు. రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ చేసిన తర్వాత ఇ-వెరిఫై చేయడం మర్చిపోవద్దు' అని ఆదాయపు పన్ను శాఖ సూచిస్తోంది. మూడు రకాలు రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ సమర్పించవచ్చు. రీప్రాసెస్ రిటర్న్, ట్యాక్స్ క్రెడిట్ పొరపాట్లు సవరణ, రిటర్నుల డేటా సవరణ అభ్యర్థణ చేయవచ్చు. సెక్షన్ 143 కింద జారీ చేసే నోటీసులో రీఫండ్, వడ్డీ వంటి వివరాలు ఉంటాయి. మీ ఐటీ రిటర్నుల్లోని సమాచారం, ఐటీ శాఖ రికార్డుల్లో ఉన్న సమాచారానికి వ్యత్యాసాలు ఉంటే నోటీసు ఇస్తారు. ఇలా నోటీసులు వచ్చినప్పుడు వెంటనే స్పందించాల్సి ఉంటుంది.

## మిశ్రమ ధోరణిలోనే..



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమ ధోరణిలో సాగే అవకాశం కనిపిస్తోంది. జీఎస్‌టీ సంస్కరణలు చోదక శక్తిగా పనిచేస్తున్నప్పటికీ అమెరికా సుంకాలు, ట్రంప్ పదేపదే బెదిరింపు వైఖరితో ప్రకటనలు చేస్తుండటంతో పాటు అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొనటం సూచీలకు సరైన దిశ లభించటం లేదు. ప్రస్తుతం మైనింగ్, వినియోగం, మెటల్స్, ఆటో, ఎలక్ట్రికల్స్ రంగాలు మాత్రమే బలాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇన్వెస్టర్లు ఆయా రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్న షేర్లలో పెట్టుబడులు పెట్టవచ్చు. అయితే రిస్క్, రివార్డును బట్టి ముందుకు వెళ్లటం మంచిది. మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే బలపడుతోంది. గత శుక్రవారం రూ.269 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.260 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.255 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి. ఆదిత్య బిర్లా ఫ్యాషన్ రిటైల్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ప్రస్తుతం రివర్సల్‌కు సిద్ధమవుతోంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరుస్తుండటమే ఇందుకు కారణం. గత శుక్రవారం రూ.85 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.90 టార్గెట్ ధరతో రూ.82 శ్రేణిలో పడే కొద్దీ కొనుగోలు చేయవచ్చు. రూ.80 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి. బీఎసఈ: ప్రస్తుతం ఈ షేరు అత్యంత ఆకర్షణీయమైన జోన్‌లో ఉంది. జీవితకాల గరిష్ఠం నుంచి దాదాపు 30 శాతం కరెక్షన్ జరిగిన తర్వాత పుల్‌బ్యాక్ అయ్యేలా కనిపిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.2,319 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,300పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,250 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి. ఎన్ఎండీసీ: కొంతకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ కౌంటర్‌లో ఇప్పుడు ట్రెండ్ రివర్సల్ అవుతోంది. ప్రస్తుతం కీలక నిరోధ స్థాయి రూ.75 వద్ద ఉంది. దీన్ని అధిగమిస్తే మరింత మూమెంటమ్ వస్తుంది. గత శుక్రవారం రూ.74.53 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.72 ఎగువన ప్రవేశించి రూ.84 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.69 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి. బయోకాన్: ఈ షేరు ప్రస్తుతం ట్రెండ్‌లైన్ సపోర్ట్ వద్ద కదలాడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. రూ.365 స్థాయిని అధిగమిస్తే మరింత పెరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.363 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.360 పై స్థాయిలో ప్రవేశించి రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.350 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

## పసిడిపై కేంద్ర బ్యాంకులకు తగ్గని మోజు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలోని కేంద్ర బ్యాంకులకు కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది. దీంతో అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో పెట్టుబడులు తగ్గించి, తమ ఫారెక్స్ నిల్వల్లో పెద్దఎత్తున పసిడి నిల్వలు పెంచుకుంటున్నాయి. ఈ కొనుగోళ్లు ఎంత లేదన్నా ఏటా 1,000 టన్నుల వరకు ఉన్నట్టు అంచనా. 2022-25 మధ్య కాలంలో ప్రపంచంలో అమ్ముడైన మొత్తం పసిడిలో 23 శాతాన్ని కేంద్ర బ్యాంకులే కొనుగోలు చేశాయి. యూరోపియన్ కేంద్ర బ్యాంక్ ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), చైనా పీపుల్స్ బ్యాంక్‌తో సహా వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల వద్ద ప్రస్తుతం 4.5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.397.35 లక్షల కోట్లు) విలువైన 36,000 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో పెట్టుబడులతో పోలిస్తే ఇది దాదాపు లక్ష కోట్ల డాలర్లు ఎక్కువ. పసిడి కొనుగోలుకు ప్రధాన కారణాలు..

క్షీణిస్తున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ
అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి
పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు
పసిడిపై అధిక రాబడులు
సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఉన్న ప్రత్యేకత
అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయన్న అంచనాలు
అమెరికాలో కొనసాగుతున్న అధిక ద్రవ్యోల్బణం
మారుతున్న కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధానాలు

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ మంగళవారం 09 । సెప్టెంబర్ । 2025

## తొలి రోజే హౌజ్‌లో గందరగోళం..రీతూ చౌదరి, హరీష్, మనీష్ మధ్య మాటల యుద్ధం



బిగ్ బాస్ సీజన్ 9 ఎట్టకేలకి గ్రాండ్‌గా లాంచ్ అయింది. మొత్తం 15 మంది కంటెస్టెంట్స్ హౌజ్‌లోకి అడుగుపెట్టగా, ఇందులో ఆరుగురు కామన్ పీపుల్ ఉన్నారు. అయితే ఇప్పటి వరకూ బిగ్ బాస్ సీజన్‌లలో తొలి రోజు చాలా సరదాగా, ఫన్ గా గడపడం మనం చూశాం. కానీ 'బిగ్ బాస్ తెలుగు సీజన్ 9' మాత్రం భిన్నంగా ప్రారంభమైంది. ఎప్పటిలా సరదా పరిచయాలు, హాస్యానికే పరిమితం కాకుండా%ొ% తొలిరోజే హౌస్‌లో గొడవలు చెలరేగాయి. హౌస్‌లోని సభ్యులంతా తమ మధ్య పనుల భాగస్వామ్యం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరికొకరు బ్యాడ్జ్‌లు ఇచ్చుకుంటూ పనులు కేటాయించారు. ఈ క్రమంలో పవన్, గిన్నెలు కడగడం బాధ్యతగా రీతూ చౌదరికి ఇచ్చాడు. అప్పుడే మొదలైంది చర్చ."హౌస్ క్లీనింగ్ అంటే స్టౌవ్ కూడా వస్తుందా?" అంటూ రీతూ ప్రశ్నించగా,హరీష్.. అన్నీ వస్తాయి.. కిచెన్ టేబుల్ కూడా క్లీనింగ్‌లో భాగమే కదా అని సమాధానమిచ్చాడు. ఇమ్మాన్యుయేల్ కూడా మద్దతు ఇస్తూ.. మేమే అన్నీ చేస్తే, తరువాత వాళ్ళు కూడా అదే ఫాలో అవ్వాలి అన్నాడు. ప్రియ మాత్రం స్పష్టంగా చెబుతూ.. కుక్ చేసేవాళ్లు క్లీనింగ్ చేయరు.. కుక్ ఒక్కరే చేస్తారు అని తేల్చేసింది. దీంతో హరీష్, క్లీనింగ్ పని ఖాళీగా ఉన్న సంజన చేయాలని సూచించాడు. ఈ వ్యాఖ్యలపై మనీష్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మాటల తూటాలు పేలాయి.ఇలా చెప్పడం సబబు కాదు అని మనీష్ స్పందించగా, నీకు బ్యాడ్జ్ రాలేదు కదా.. నువ్వు మాట్లాడొద్దు అని హరీష్ ఘాటుగా అన్నాడు. దీనిపై మనీష్ఎందుకు మాట్లాడకూడదు? అని ప్రశ్నించడంతో గొడవ ముదిరింది.



## చెట్టు కింద చదువు నేర్పిన శ్రీ లీల!



శ్రీ లీల.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. కన్నడ బ్యూటీ అయినప్పటికీ తెలుగులో సత్తా చాటుతూ దూసుకుపోతోంది. 'పెళ్లి సంద%ణ%' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె.. రవితేజ హీరోగా నటించిన 'ధమాకా' సినిమాతో ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ అందుకుంది.. ఆ తర్వాత పలు చిత్రాలలో నటించిన ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. మధ్యలో భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి చిత్రాలు చేసి.. మోస్తారుగా విజయాన్ని అందుకుంది. %ూశ్రీంశీ =ఘుం% - 500 ఎకరాల ఆస్తిపరుడు చివరకు కమెడియన్ గా! ప్రస్తుతం తెలుగులో రవితేజతో మరొకసారి మాస్ జాతర అనే సినిమాలో చేస్తున్న ఈమె.. ఇటు పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 7న ఆమె సినిమా షూటింగ్లో కూడా భాగమయ్యారు. ఈ విషయాన్ని రాసి ఖన్నా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించిన విషయం తెలిసిందే. అలాగే మరోవైపు బాలీవుడ్ లో కార్తీక ఆర్యన్ తో ఒక సినిమా చేస్తున్న ఈమె.. అక్కడే మరో ప్రాజెక్టుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అలా తెలుగు, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ బిజీగా మారిన ఈమెకు సంబంధించిన ఒక విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. శ్రీ లీల స్వతహాగా డాక్టర్ అనే విషయం అందరికీ తెలిసిందే. ఒకవైపు నటిస్తూ మరొకవైపు ఎంబిబిఎస్ కూడా పూర్తి చేసింది. అంతేకాదు ఇద్దరు పిల్లలను దత్తత తీసుకొని తన మంచి మనసు చాటుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. అలాంటి ఈమె టీచర్ కూడా అని తెలిసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే అది ఇప్పుడు కాదు అని.. విద్యార్థి దశలో ఉన్నప్పుడే చిన్నపిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పిందని సమాచారం.ఇదే విషయంపై ఆమె మాట్లాడుతూ.." నేను చిన్నప్పుడు బెంగళూరులో ఉండేదాన్ని. కానీ వేసవి సెలవులు వస్తే మాత్రం నా స్వస్థలమైన ఒంగోలుకు వెళ్లేదాన్ని. అక్కడ చిన్నప్పుడు మా తాత నాగేశ్వరరావు నిడమానూరి ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకం ఇచ్చేవారు. అయితే పుస్తకంలో ఉన్న ఇంగ్లీష్ నేర్చుకొని చెట్టు కింద పిల్లల్ని పోగేసుకొని వాళ్లకు ఇంగ్లీష్ పాఠాలు చెబుతూ వారికి చదువు చెప్పాను. అలా నాకు చిన్నప్పుడే ఇంగ్లీష్ పై మంచి పట్టు ఏర్పడింది. ముఖ్యంగా ఈ పట్టు రావడానికి కారణం మా తాత ఇచ్చిన ప్రోత్సాహమే. అది ఎప్పటికీ మరువలేనిది" అంటూ శ్రీ లీల తెలిపింది %ూశ్రీంశీ =ఘుం% - రెండున్నర నెలల్లో రెండు.. రవితేజ హిట్ ట్రాక్ ఎక్కేస్తారా? అలాగే తన గ్రాండ్ పేరెంట్స్ తో తనకు ఉన్న అనుభవాలను పంచుకుంటూ.." జీవితం చాలా చిన్నది. అందుకే ప్రతి ఒక్కరు గ్రాండ్ పేరెంట్స్ తోనే గడపాలి అప్పుడే జీవితంపై ఒక స్పష్టత వస్తుంది. ఇప్పటికీ నాకు ఏదైనా సలహా కావాలి అంటే ముందుగా మా తాతయ్యను అడుగుతాను. మా అమ్మ తర్వాత నాకు తాతయ్య అంటే చాలా ఇష్టం. ఆయన సలహా లేకుండా ఏదీ కూడా ముందడుగు వేయలేను" అంటూ క్లారిటీ ఇచ్చింది శ్రీలీల. మొత్తానికైతే తన గ్రాండ్ పేరెంట్స్ తో తనకు ఉన్న అనుభవాలను తాజాగా అభిమానులతో పంచుకుంది ఈ ముద్దుగుమ్మ.

## మల్లెపూలు తెచ్చిన తంటా.. హీరోయిన్‌కి లక్ష ఫైన్!



మల్లెపూలు.. సువాసన భరితమే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తాయి. మానసిక ప్రశాంతతను కలిగించడమే కాకుండా మగువల అందాన్ని రెట్టింపు చేస్తాయనడంలో ఈ మల్లెపూలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్న విషయం తెలిసిందే. అయితే ఇలాంటి మల్లెపూలు ఇప్పుడు ఒక హీరోయిన్ కు ఏకంగా లక్ష ఫైన్ వేసేలా చేశాయి.. ఏంటీ? మల్లెపూలు.. హీరోయిన్ కి లక్ష ఫైనా? అంటూ ఆశ్చర్యపోతున్నారా? మీరు విన్నది అక్షరాల నిజమే.. మరి ఇది ఎక్కడ జరిగింది? అసలు ఆ హీరోయిన్ ఏం చేసింది? ఆమెకు లక్ష ఫైన్ ఎందుకు? ఎవరు విధించారు? అంటూ ప్రజలు నుంచీ ఇలా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. మూర మల్లెపూలు.. హీరోయిన్ కి లక్ష ఫైన్.. విషయంలోకి వెళ్తే.. ఓనం సెలబ్రేషన్స్ లో భాగంగా నవ్య నాయర్ మెల్బోర్న్ కి వెళ్ళింది.. ఎయిర్పోర్టులో ఆ మల్లెపూలను గుర్తించిన సిబ్బంది.. అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి అధికారులు ఈమెకు ఈ మొత్తంలో జరిమానా వేశారు. అయితే ఈ విషయంపై మెల్బోర్న్ లో జరిగిన ఈ ఓనం కార్యక్రమంలో నవ్య నాయర్ మాట్లాడుతూ.." నేను తీసుకొచ్చిన మల్లెపూలు లక్ష రూపాయలు ఖరీదైనవని జరిమానా విధించే వరకు నాకు తెలియదు" అంటూ చమత్కరించింది. ప్రస్తుతం ఈమె చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఏది ఏమైనా అక్కడి భద్రతా కారణంగా వారు ఫైన్ విధించారు. ఆ విషయం తెలియని నవ్య నాయర్ ఏకంగా మూర మల్లెపూల కోసం లక్ష రూపాయలు నష్టపోయింది అంటూ పలువురు కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. ఫైన్ ఎందుకు విధించారంటే? ఇకపోతే ప్రపంచంలోని అత్యంత కఠినమైన బయో సెక్యూరిటీ చట్టాలు కలిగిన విమానాశ్రయాలలో ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ ఎయిర్పోర్ట్ కూడా ఒకటి. ఇక్కడ పండ్లు, విత్తనాలు, పూలను తీసుకువెళ్లడం నిషిద్ధం. అందుకే ప్రయాణికులు సాధ్యమైనంత వరకు వీటిని తమతో తీసుకెళ్లడానికి ఇష్టపడరు.. వీటివల్ల ప్రయాణికులకు వివిధ రకాల వ్యాధులు, తెగుళ్లు సులభంగా వ్యాపించే అవకాశం ఉండడంతో ఈ నిబంధన పెట్టారు.

ఇక్కడి వరకు అంతానే బాగున్న ఈ విషయం తెలియని ప్రముఖ మలయాళ నటి నవ్య నాయర్ మెల్బోర్న్ విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడి

## లండన్‌లో పవన్ కల్యాన్ ఓజీ టీం.. అదిరిపోయే వార్త షేర్ చేసిన థమన్




టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ ఓజీ. సుజీత్ డైరెక్షన్‌లో పాన్ ఇండియా గ్యాంగ్ స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓజీతో బాలీవుడ్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ టాలీవుడ్ డెబ్యూ ఇస్తున్నాడు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కాగా థమన్ అదిరిపోయే అప్‌డేట్ అందించి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. థమన్‌తోపాటు 117 మంది మ్యుజిషియన్స్ ఓజీ కోసం లండన్‌లోని అబ్బే రోడ్ స్టూడియోలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ రికార్డింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్టూడియో ఫొటోను షేర్ చేస్తూ అందరితో పంచుకున్నాడు థమన్. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జెట్ స్పీడ్‌లో కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు విడుదల చేసిన రెండు పాటలను అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. మరోవైపు థర్డ్ సింగిల్ గురించి ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అప్‌డేట్ రానుంది. కాగా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలుకరిస్తుండటం. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓజీ సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా తెలుగుతోపాటు పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది.

## బెడ్‌పై పరువాలు వల్లిస్తున్న సోనాల్

సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడ్డారు సినీ భామలు. తమ అందంతో అలరించడమే కాకుండా హాట్ ఫోజులతో హీట్ పుట్టిస్తూ.. కుర్రాళ్లలో కోరికలు కలిగిస్తున్నారనే వార్తలు కూడా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భిన్న విభిన్నమైన భంగిమలలో ఫోటోలకు ఫోజులిస్తున్న ఈ తారలను చూస్తే నిజంగా ఫాలో కొట్టక మానరు అని కొంతమంది నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరొక హాట్ బ్యూటీ కూడా తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసే ప్రయత్నం చేసింది. 500 ఎకరాల ఆస్తిపరుడు చివరకు కమెడియన్ గా! గ్రీన్ కలర్ డ్రెస్ ధరించి ఎద అందాలతో పాటు థైస్ అందాలను చూపిస్తూ కుర్ర కారు మతులు పోగొట్టేసింది. ముఖ్యంగా బెడ్ పై హాట్ ఫోసులలో రెచ్చిపోయింది. అసలే సోనాల్ చౌహాన్ అందానికి ఎంతోమంది అభిమానులు ఉన్నారు. అలాంటిది ఈమె ఏకంగా లో అందాలను కూడా బయట పెడుతూ ఫోటోలు షేర్ చేస్తే తట్టుకుంటారా? అసలే తన అందంతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉంటుంది. అలాంటిది ఇప్పుడు ఇలా బెడ్ పై హీట్ పుట్టించేలా ఫోటోలు షేర్ చేయడంతో.. ఇంత హీట్ ఎలా తట్టుకోవాలి అని ఫాలోవర్స్ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి అయితే సోనాల్ చౌహాన్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో మంట పెడుతున్నాయి. సోనాల్ చౌహాన్ కెరియర్ విషయానికి వస్తే.. 1989 మే 16న బులంద్షహర్ అనే ప్రాంతంలో జన్మించింది. మోడల్గా కెరియర్ ను మొదలుపెట్టిన ఈమె.. ఆ తర్వాత గాయకురాలిగా మారి, తన గాత్రంతో ఎంతోమంది శ్రోతలను అలరిం చింది. ఆ తర్వాత నటిగా సినీ ఇండస్ట్రీ లోకి అడుగు పెట్టింది.



## వంద ఫొటోల నుండి నన్ను సెలక్ట్ చేశారు.. ఆ పిక్ నా జీవితాన్ని మార్చింది: తేజ సజ్జా




ప్రస్తుతం 'మిరాయ్ ' సినిమాతో పాన్ వరల్డ్ స్థాయిలో ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్న యంగ్ హీరో తేజ సజ్జ, తన నటనా ప్రయాణాన్ని బాల నటుడిగా ప్రారంభించిన విషయం తెలిసందే. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి నటించిన 'చూడాలని ఉంది' సినిమాతో తెరంగేట్రం చేసిన తేజ, ఆ తరువాత 'ఇంద్ర', 'ఠాగూర్' వంటి చిత్రాల్లో కూడా బాలనటుడిగా మెరిశాడు. ఈ చిత్రాల వల్ల తేజకి చిరంజీవితో మంచి బాండింగ్ ఏర్పడింది. బాల నటుడిగా తేజ ఉన్న సమయంలో ఆయన ప్రతి పుట్టిన రోజుని చిరు సెలబ్రేట్ చేసేవారట. ఈ విషయాన్ని తేజనే ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. చిరంజీవి బర్త్‌డే ఆగష్టు 22, తేజ బర్త్‌డే ఆగష్టు 23 కావడంతో చిరు మరిచిపోకుండా తేజను ప్రత్యేకంగా ఆహ్వానించి, కేక్ కట్ చేయించేవారట. అది ఇప్పటికీ నా జీవితంలో ఓ ప్రత్యేక జ్ఞాపకం అని తేజ అన్నారు. అయితే తాజాగా మిరాయ్ ప్రమోషన్‌లో భాగంగా తేజ మాట్లాడుతూ.. ఇంద్రలో తనకి అవకాశం రావడం పట్ల స్పందించాడు. కొన్ని వందల ఫొటోల నుండి చిరంజీవి గారు నా ఫొటో పిక్ చేశారు. అలా నా జీవితం మారింది అని తేజ సజ్జా స్పష్టం చేశారు. తేజ నిన్నటితరం మెగా హీరోలందరి చిత్రాల్లో బాలనటుడిగా నటించాడు. పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ సినిమాల్లోనూ తేజ కనిపించాడు. చిరంజీవి నటించిన 'చూడాలని ఉంది' సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించి యాక్టింగ్ కెరీర్‌ని స్టార్ట్ చేసాడు తేజ సజ్జ. ఇక సమంత ప్రధాన పాత్రలో నటించిన ఓ బేబీ చిత్రంతో తేజ సజ్జా హీరోగా వెండితెర నటించారు. ఆ తర్వాత జాంబీ రెడ్డి సినిమాలో నటించి నటుడిగా ప్రశం సలు అందుకున్నారు. ఆ తర్వాత ఇష్క్, అద్భుతం చిత్రాలు థియేటర్లలో కమర్షియల్ హిట్ అందుకోలేకపోయాయి. చివరిగా హనుమాన్ చిత్రంలో నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు. ఇక ఇప్పుడు మిరాయ్‌తో అద్భుతం చేయబోతున్నాడు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ రోజు గోకుల్ పార్క్ బీచ్, వైజాగ్‌లో మిరాయ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించబోతున్నారు.

## అఫీషియల్.. 46 ఏళ్ల తర్వాత బిగ్ స్క్రీన్‌పై సందడి చేయబోతున్న కమల్-రజనీకాంత్



సౌత్ ఇండస్ట్రీలో రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ అత్యంత ప్రభావవంతమైన దిగ్గజ నటులు . వీరిద్దరినీ సినిమా రంగానికి పరిచయం చేసిన వ్యక్తి దర్శకుడు కె. బాలచందర్. ఆయన దర్శకత్వంలో వీరిద్దరూ కలిసి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించారు. 1985 వరకు వీరు కలిసి 15కి పైగా సినిమాల్లో నటించగా, ఆ తర్వాత మాత్రం కలిసి నటించింది లేదు. వారి కాంబోలో సినిమా రాక దాదాపు 46 ఏళ్లు అయింది. ప్రస్తుతం కమల్ హాసన్ రాజకీయ రంగంలోనూ తన సత్తా చాటుతున్నారు. డిఎంకే పార్టీ మద్దతుతో రాజ్యసభ ఎంపీగా ఎంపికయ్యారు. సినిమాలు, రాజకీయాలు రెండింటినీ సమానంగా బ్యాలెన్స్ చేస్తున్న ఆయన ఈ వయస్సులోను చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

## ఆసియా కప్ 2025 సిద్ధం..ఫార్మాట్, టీమ్‌లు, ఫస్ట్ మ్యాచ్ ఎక్కడో తెలుసా



**న్యూదిల్లీ-నవభూమి:** క్రికెట్ ప్రియులకు మళ్లీ గుడ్ న్యూస్ వచ్చింది. 2025 ఆసియా కప్ 2025) సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి టోర్నమెంట్ 20 ఫార్మాట్‌లో జరుగుతుంది. ఈసారి ఆసియా కప్‌ను టీ20 వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లాన్ చేశారు. ఎందుకంటే 2025 అక్టోబర్‌లో భారత్, శ్రీలంక సంయుక్తంగా టీ20 వరల్డ్ కప్ నిర్వహించబోతున్నాయి. దీంతో అన్ని ఆసియా జట్లు తమ బలహీనతల్ని తెలుసుకునే మంచి ఛాన్స్‌గా ఈ టోర్నీని భావిస్తున్నాయి. ఈ సారి టోర్నమెంట్ మళ్లీ %ు%20 ఫార్మాట్‌లో జరగనుంది. అది కూడా 2026లో భారత్, శ్రీలంకల్లో జరిగే 20 వరల్డ్ కప్‌కి సన్నాహకంగా. గతంలో 2022లో శ్రీలంక ఆసియా కప్‌ని గెల్చుకుంది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో పాకిస్తాన్ జట్టును ఓడించింది.

**ఆసియా కప్ 2025 ఫార్మాట్**

ఈ సారి ఆసియా కప్ మూడు దశల్లో జరుగుతుంది. గ్రూప్ దశ, సూపర్ 4, ఫైనల్. ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విభజించబడ్డాయి. ప్రతి గ్రూప్‌లో నాలుగు జట్లు ఉంటాయి.

గ్రూప్ ఏలో భారత్, పాకిస్తాన్, ఒమన్, గ్రూప్ బీలో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్

గ్రూప్ దశ..ఈ దశలో ప్రతి గ్రూప్‌లోని జట్లు ఒకరినొకరు ఒక్కసారి తలపడతాయి. అంటే గ్రూప్ ఏలో భారత్ పాకిస్తాన, భారత్ ఒమన్, భారత్ ఇలా మ్యాచ్‌లు ఉంటాయి. అదే విధంగా గ్రూప్ బీలో కూడా. ఈ గ్రూప్ దశలో టాప్-2 జట్లు సూపర్ 4కి అర్హత సాధిస్తాయి.


అంటే ప్రతి గ్రూప్ నుంచి రెండు జట్లు ముందుకు వెళతాయి. ఇక్కడ భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటే ఫ్యాన్స్‌కి చాలా ఆసక్తి ఉంటుంది.

## అర్హత ఉన్నా అవకాశం రాకపోతే.. ఆసియా కప్ ఎంపికపై అయ్యర్



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా తరపున వన్డేల్లో కీలక ఆటగాడిగా మారిన శ్రేయస్ అయ్యర్ ను ఆసియా కప్-2025కు ఎంపిక చేయకపోవడంపై తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. సెలక్షన్ కమిటీ తీరుపై మాజీలు, క్రికెట్ అభిమానులు అసహనం వ్యక్తం చేశారు. అయితే ఈ అంశంపై శ్రేయస్ అయ్యర్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన శ్రేయస్ అయ్యర్ తనను ఆసియా కప్ ) కోసం పరిగణనలోకి తీసుకోకపోవడంపై స్పందించాడు 'తుది జట్టులో ఉండే అర్హత ఉన్న ఆటగాడిని కనీసం టోర్నీకి కూడా ఎంపిక చేయకపోతే ఎవరికైనా అసహనం కలుగుతుంది. అయినా మన చేతిలో ఏమీ ఉండదు. మన పని మనం నిబద్ధతతో చేసుకుంటూ వెళ్లిపోవడమే. ఎవరో చూస్తున్నారని పని చేయకూడదు. అవకాశం లభించినపుడు ఉత్తమ ప్రదర్శన చేయాలి. జట్టును గెలిపించడానికి ప్రయత్నించాలి' అని అయ్యర్ ఆ పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం తన కెరీర్‌లో ఓ మధురానుభూతి అని అయ్యర్ చెప్పాడు .

## యూఎస్ ఓపెన్ టైటిల్ గెల్చుకున్న కార్లోస్ అల్కరాజ్



**న్యూఢిల్లీ-నవభూమి:** యూఎస్ ఓపెన్ 2025 మెన్స్ సింగిల్స్ టైటిల్‌ను 22 ఏళ్ల యువ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ గెలుచుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ జన్నిక్ సిన్నర్‌పై 6-2, 3-6, 6-1, 6-4 స్కోర్‌తో విజయం సాధించి, తన రెండో యూఎస్ ఓపెన్ టైటిల్, మొత్తం ఆరో మేజర్ టైటిల్‌ను సాధించాడు. ఇది ఇది కార్లోస్‌కు మూడు సంవత్సరాల తర్వాత మొదటి హార్డ్-కోర్ట్ మేజర్ విజయమని చెప్పవచ్చు. దీంతో అతను ఇప్పుడు %ూఖా% ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ 1 పొజిషన్‌కు తిరిగి చేరుకున్నాడు.

రెండోసారి ఫైనల్లో..ఇది 2022లో మొదటి సారిగా అల్కరాజ్ గ్రాండ్ స్లామ్ టైటిల్ గెలిచిన టోర్నమెంట్ కావడం విశేషం. మళ్లీ అదే ఓపెన్‌లో తన అద్భుత ఆటతో రెండోసారి ఫైనల్లో విజయం సాధించాడు. అతను మాజీ నెం.1 ఆటగాడు అయిన సిన్నర్‌ను 6-4, 7-6(4), 6-2 తేడాతో ఓడించాడు. ఈసారి అల్కరాజ్ ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫైనల్‌కి వచ్చాడు. వింబుల్డన్ టైటిల్ కోల్పోయిన తర్వాత, సిన్సినాటి ఓపెన్ గెలిచి తిరిగి ఫామ్‌లోకి వచ్చిన అల్కరాజ్ అప్పటినుంచి 12 మ్యాచ్‌లు వరుసగా గెలిచాడు. సిన్నర్ మాత్రం..ఇదే సమయంలో 24 ఏళ్ల ఇటాలియన్ ఆటగాడు సిన్నర్ తన 2024 ఫామ్‌ను కొనసాగిస్తూ, ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను రీ డిఫెండ్ చేశాడు. వింబుల్డన్‌లో అల్కరాజ్‌ను ఓడించి తన తొలి గ్రాస్‌కోర్ట్ గ్రాండ్ స్లామ్‌ను గెలిచాడు. ఓపెన్‌కు ముందు మిక్స్‌డ్ డబుల్స్ నుంచి తప్పుకున్నా, సిన్నర్ సింగిల్స్‌లో మంచి ఆటతీరు కనబరిచాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**